

నత్తనడకన..

జిల్లాలో గృహ నిర్మాణాల దుస్థితి

మంజూరైన గృహాల సంఖ్య 86,074

జిల్లాలో గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో 86,074 గృహాలు మంజూరైతే ఇప్పటి వరకు 28,666 గృహాలే పూర్తయ్యాయి. 28,415 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉంటే, 28,993 గృహాల నిర్మాణం అసలు ప్రారంభమేకాలేదు. ప్రతి 15 రోజులకు ఒకసారి గృహ నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించినా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడంలేదు. దీంతో శుక్రవారం జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ బాలాజీ గృహ నిర్మాణశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- ఇప్పటి వరకు పూర్తయినవి 28,666
- వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నవి 28,415
- అసలు నిర్మాణాలే ప్రారంభం కానివి 28,993
- గృహ నిర్మాణశాఖ అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 86,074 గృహాల నిర్మాణానికి గతంలో అనుమతులు ఇచ్చారు. ఇప్పటి వరకు 28,666 గృహాల నిర్మాణాలను పూర్తి చేశారు. 28,993 గృహాల నిర్మాణాలను అసలు ప్రారంభించనేలేదు. 28,415 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లుగా అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా గృహ నిర్మాణం నిమిత్తం రూ.50 వేలను ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే ఈ విషయం లబ్ధిదారులకు తెలియజేయకుండా అధికారులు గోప్యత పాటించడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీలు నిర్మాణం చేసుకున్న గృహాలకు ప్లాస్టింగ్ పనులు పూర్తిచేస్తే రూ.15వేలు, ఇంటిలో నాపరాయి, లేదా ఫ్లోరింగ్ పనులు చేస్తే రూ.15వేలు, విద్యుత్ పనులు, మరుగుదొడ్డి నిర్మాణ పనులు చేస్తే రూ.10 వేలు చొప్పున మొత్తంగా రూ.50 వేలను ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియకుండా ఉంచడంపై శుక్రవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ బాలాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2025 మార్చి నెలాఖరు నాటికి గతంలో ప్రారంభించి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 3,783 గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా గృహ నిర్మాణాలు పూర్తి కాలేదు. ఈ నెల 13వ తేదీన కలెక్టర్ గృహ నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించిన సమయంలో ఈ నెలాఖరులోగా 910 గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని చెప్పారు. అయితే 412 గృహాల నిర్మాణాలను పూర్తి చేసినట్లుగా అధికారులు లెక్కలు చూపారు.



మోపిదేవి మండలం మేళ్లమర్తిలంకలో అసంపూర్తిగా గృహాలు

పనితీరు మార్చుకోవాలి

గృహ నిర్మాణంలో మచిలీపట్నం నగరంతోపాటు, అవనిగడ్డ, కోడూరు, గన్నవరం, చల్లపల్లి, పెదపారుపూడి, కృత్తివెన్ను, మోపిదేవి, గుడివాడ, నాగాయలంక మండలాలు వెనుకబడి ఉన్నట్లుగా కలెక్టర్ తన సమీక్షలో తెలియజేశారు. మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, గృహనిర్మాణసంస్థ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వలనే గృహ నిర్మాణాలు ముందుకు సాగడంలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోనని హెచ్చరించారు. కృత్తివెన్ను మండల ఏఈని పనితీరు మార్చుకోవాలని సూచించారు.

అక్రమార్కులపై చర్యలేవి?

గృహ నిర్మాణాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై అధికారులకు పలు ఫిర్యాదులు అందుతున్నాయి. కోడూరు, ఘంటసాల, పెదపారుపూడి మండలాల్లో అధికారులు చేసిన అక్రమాలపై విచారణ జరుగుతోంది. కోడూరు మండలంలో సిమెంటు, ఇనుము పక్కదారి పట్టిన అంశంపై రెండు రోజుల క్రితం అధికారులు విచారణ పూర్తిచేశారు. అధికారులకు వచ్చిన ఫిర్యాదులో కంటే అధికంగానే సిమెంటు, ఇనుము పక్కదారి పట్టినట్లు తేలిందని ఆ శాఖ అధికారులు చెప్పుకుంటున్నారు. ఘంటసాల మండలంలోని లబ్ధిదారులకు ఇచ్చేందుకు వచ్చిన సిమెంటు, ఇనుమును ఘంటసాలలోని గోడౌన్‌కు తరలించకుండా, కోసూరులోని ప్రైవేట్ గోడౌన్‌లో దించుకుని, అక్కడ విక్రయించేసిన అంశంపైనా విచారణ జరుగుతోంది. గతంలో ఘంటసాలలో పని చేసిన ఏఈ ఈ వ్యవహారం నుంచి బయట పడేందుకు తెరవెనుక మిగతా 4లో..

బైక్ చోరీలకు చైన్ లాక్!

మూడు పీఎస్‌ల పరిధిలో కొత్త ప్రణాళిక అమలు

- తగ్గిన బైక్ అపహరణ ఫిర్యాదులు
- ఆధారాలు చూపిస్తేనే అన్‌లాక్
- సత్ఫలితాలనిస్తున్న చైన్‌లాక్ కార్యక్రమం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పెట్టిన ద్విచక్ర వాహనాలకు చైన్ వేసి తాళాలు వేస్తున్న పోలీస్

- ఓ యువకుడు తన బైక్‌ను పీఎన్‌బీఎస్‌లో పెట్టి ఏలూరు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూస్తే బైక్ కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ కృష్ణలంక పోలీసులను ఆశ్రయించాడు.
- చిట్టినగర్‌లోని కొండ ప్రాంతంలో నివాసం ఉండే ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని కొండ దిగువన రోడ్డుపక్క పెట్టి ఇంటికి వెళ్లాడు. మర్నాడు ఉదయం కొండ దిగి వచ్చి చూస్తే బైక్ పెట్టినచోట లేదు. దీంతో వెంటనే కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.
- ఇంటి ముందు రాత్రి నిలిపిన ద్విచక్రవాహనం ఉదయం వరకు ఉంటుందన్న భరోసా ఉండడం లేదు. రైల్వే స్టేషన్ వద్ద పెట్టి రైలెక్కితే తిరిగి వచ్చే సరికి బైక్ ఏమవుతుందో తెలియదు. బస్‌స్టాండ్‌లోనూ ఇదే పరిస్థితి. అక్కడ, ఇక్కడా అన్న తేడా లేకుండా ఎక్కడా చూసినా బైక్‌లకు భద్రత ఉండడం లేదు. ఎక్కడో ఒక చోట బైక్ మాయమవుతూనే ఉంది. దీనికి చెక్ పెట్టడానికి ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ అధికారులు గొలుసుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా ముందు విజయవాడ నగరంలో దీన్ని పట్టాలు ఎక్కించారు. ప్రస్తుతం మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో అమలు చేస్తున్నారు. ఇది పూర్తిస్థాయిలో విజయవంతమైతే జిల్లా మొత్తం అమలు చేయాలని భావిస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి -విజయవాడ)

మిగతా 4లో..



మంగినపూడి బీచ్‌లో అమరావతి గేట్ వే ఆకృతిని ఇనుపగడ్డర్లతో నిర్మిస్తున్న కార్మికులు

శరవేగంగా..

మసూల బీచ్ ఫెస్టివల్‌కు సిద్ధమవుతున్న మంగినపూడి

మచిలీపట్నం టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో జూన్ 5, 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న మసూల బీచ్ ఫెస్టివల్‌కు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. బీచ్ ముఖద్వారం వద్ద అమరావతి గేట్ వేను ఇనుపరాడ్‌లతో నిర్మిస్తున్నారు. బుద్ధుని ప్రతిమ, పాండురంగని ప్రతిమతో పాటు చేపలు, తిమింగలాల ఆకృతులు అందంగా రూపొందిస్తున్నారు. ఈ బొమ్మలకు కళాకారులు రంగులు అద్దుతున్నారు. ఆర్ట్ డిజైనర్ వంకా రమణ ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై కలెక్టర్ బాలాజీ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదికలు సిద్ధం చేస్తున్నారు.



ఆకట్టుకుంటున్న చేప ఆకృతి



బొమ్మలకు రంగులు అద్దుతున్న కళాకారులు



సిద్ధమవుతున్న చేప, తిమింగలం ఆకృతులు

బంగారం స్కామర్ ఎక్కడ?

ప్రజల ఆశలను ఒక ఆయుధంగా చేసుకుని ఓ పక్క బంగారం, మరోపక్క నగదు చీటీలు నిర్వహించి ఖాతాదారులను నిలువునా ముంచేసిన ముచ్చెర్ల శ్రీనివాసరావు కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. బాధితుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో ముచ్చెర్ల మోసం విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని చర్చ జరుగుతోంది. బాధితుల్లోకి కొందరు కోవర్టులను పంపి ఇక్కడ జరుగుతున్న విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు సమాచారం.

గోల్డ్ బిస్కట్లతో చీటీలు నిర్వహించి ఖాతాదారులను ముంచిన ముచ్చెర్ల శ్రీనివాసరావు

- అతని కోసం విస్తృతంగా పోలీసుల గాలింపు
- స్టేషన్‌కు పెరుగుతున్న బాధితుల సంఖ్య
- కోవర్టుల ద్వారా ఇక్కడి సమాచారం తెలుసుకుంటున్న నిందితుడు
- మోసం విలువ రూ.వందల కోట్లు అంటున్న బాధితులు

ఆంధ్రజ్యోతి-విజయవాడ : 25 మందితో గ్రూపును ఏర్పాటు చేసి, అందులో ఇద్దరు విజేతలను డ్రా ద్వారా ఎంపిక చేసి, గ్రాము బంగారం ఇచ్చి కోట్లాది రూపాయలు వసూలు చేసి పరారైన ముచ్చెర్ల శ్రీనివాసరావు కోసం పోలీసులు గాలిస్తున్నారు. శ్రీనివాసరావు చేసిన మోసాలపై మొత్తం 67 మంది బాధితులు అజిత్ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిలో 20 మంది వాంగ్మూలాన్ని పోలీసులు శుక్రవారం నమోదు చేశారు. ముచ్చెర్ల చేసిన మోసం గురించి తెలుసుకుని బాధితులు ఒక్కొక్కరు పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నారు.

ఆర్థిక లావాదేవీలపై దృష్టి

ఒక మీడియా సంస్థకు చెందిన వ్యక్తి అత్యధికంగా రూ.కోటి వరకు శ్రీనివాసరావుకు ఇచ్చాడు. ప్రస్తుతం పోలీసులను ఆశ్రయించిన బాధితుల్లో ఆయనే ఎక్కువ మొత్తంలో చెల్లించాడు. ఈ వాంగ్మూలాల నమోదు పూర్తవ్వగానే శ్రీనివాసరావు ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించాలని పోలీసులు నిర్ణయించారు. ఆయనకు ఏయే బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయో గుర్తించి, ఆ సంస్థలకు పోలీసులు లేఖ రాయాలని నిర్ణయించారు. ఈ ఖాతాలను స్తంభింపచేయాలన్న యోచనలో పోలీసులు ఉన్నారు. శ్రీనివాసరావు చేసిన మోసం విలువను ఒక్కొక్కరు ఒక్కో విధంగా చెబుతున్నారు. కొంతమంది బాధితులు రూ.100 కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. మరికొంత మంది రూ.600 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. శ్రీనివాసరావు అంతిమంగా ఎంత మేరకు కుచ్చుటోపీ పెట్టాడో ఇప్పట్లో చెప్పలేమని, దీనికి కొంత సమయం పడుతుందని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు(ఫైల్) ఇన్‌సెట్‌లో ముచ్చెర్ల శ్రీనివాసరావు

హైదరాబాద్‌లో సమాలోచనలు!

శ్రీనివాసరావు విజయవాడలో దుకాణం సర్దేసి హైదరాబాద్ పారిపోయినట్టు అనుమానిస్తున్నారు. పోలీసులు సంకెళ్లు వేయకుండా తప్పించుకునే మార్గాలపై న్యాయవాదులతో అక్కడ సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి విజయవాడలో ఉన్న కుటుంబ సభ్యులతో వాట్సాప్ కాల్స్ మాట్లాడుతున్నట్టు సమాచారం. విజయవాడలో ఇంటి వద్ద, పోలీస్‌స్టేషన్‌లో జరుగుతున్న పరిణామాలను కుటుంబ సభ్యులు, స్నేహితులను అడిగి తెలుసుకుంటున్నట్టు తెలిసింది. తనకు సంబంధించిన కొంతమందిని బాధితుల్లోకి కోవర్టులుగా శ్రీనివాసరావు వదిలాడని, బాధితుల మాదిరిగా పోలీసుల వద్దకు వెళ్లి స్టేషన్‌లో విషయాలను తెలుసుకుని శ్రీనివాసరావుకు కొంతమంది చేర్చుతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విషాదంగా ముగిసిన విహారయాత్ర

తెలంగాణలో ఘోర రోడ్డు ప్రమాదం

- చల్లపల్లికి చెందిన తల్లీ, చిన్నకుమార్తె దుర్మరణం
- పెద్దకుమార్తెకు తీవ్ర గాయాలు.. ప్రాణాలతో బయటపడ్డ తండ్రి

చల్లపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): విహార యాత్రకు వెళ్లి తిరిగివస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబంలో రోడ్డుప్రమాదం అంతులేని విషాదాన్ని నింపింది. వేసవి సెలవుల్లో కుటుంబ సమేతంగా ఊటీ అందాలను చూసి తిరిగి హైదరాబాద్ వెళుతున్న చల్లపల్లికి చెందిన కుటుంబం తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా కోదండపురం సమీపంలో 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో భార్య, చిన్నకుమార్తె అక్కడికక్కడే మృతిచెందగా, భర్త ప్రాణాలతో బయటపడ్డారు. పెద్దకుమార్తె తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనతో చల్లపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. చల్లపల్లి గ్రామానికి చెందిన చేనేతరంగ ప్రముఖుడు యర్ర కోట మల్లయ్య మనుమడు(నాగేంద్రం, మహాలక్ష్మి దంపతుల కుమారుడు) యర్ర వెంకట బాబ్జీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివసిస్తున్నాడు. బాబ్జీకి భార్య శ్రావణి(35), కుమార్తెలు మిగతా 4లో..



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన శ్రావణి, సాయి చైత్ర (సర్కిల్‌లో)

ఇలా ఎప్పటికి పూర్తి చేస్తారు

అధికారులు, కాంట్రాక్టర్లపై మండిపడ్డ మంత్రి నిమ్మల

బీడీసీ లెఫ్ట్ బండ్ రిటైనింగ్ వాల్ పనుల పరిశీలన

- కాంట్రాక్టు ఏజెన్సీకి, అధికారులకు వార్నింగ్
- గడువులోగా పూర్తి చేయకుంటే బ్లాక్ లిస్టులో పెడతాం
- సీజన్‌లోగా ఎట్టి పరిస్థితుల్లో వాల్ నిర్మాణం జరిగి తీరాలి

ఇబ్రహీంపట్నం, మే 30 (ఆంధ్రజ్యోతి): "బీడీసీ రిటైనింగ్ వాల్ పనుల్ని నత్తనడకన సాగిస్తారా.. ఇదేం పద్ధతి.. ఇలా అయితే ఎప్పటిలోగా పనులు పూర్తి చేస్తారు" అం టూ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర స్వరంతో కాంట్రాక్టు ఏజెన్సీ, అధికారులపై మండి పడ్డారు. శుక్రవారం ఆయన రిటైనింగ్ వాల్ పనుల్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ పద్ధతి మార్చుకోండి, మూడు షిఫ్టుల్లో పనులు జరగాలి, గడువు లోగా ఎట్టి పరిస్థితుల్లో బీడీసీకి భద్రత మిగతా 4లో..



బీడీసీ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల్ని పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు



పునఃప్రతిష్ఠకు ముస్తాబు చేసిన రామాలయం ప్రధాన ద్వారం

నేటి నుంచి శ్రీధనశైల సీతారామ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

జగ్గయ్యపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రసిద్ధ పురాతనమైన శ్రీధనశైల సీతారామస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు శనివారంనుంచి ప్రారంభం కానున్నాయి. మూడురోజుల పాటు జరిగే కార్యక్రమాలలో సీతాలక్ష్మణ, హనుమత్ సమేత శ్రీరామచంద్రస్వామిని, భగవద్రామానుజ చార్యులు, గోదా అమ్మ వారు, శఠగోప, సంతాన వేణుగోపాలస్వామి దేవతామూర్తుల ప్రతిష్ఠతో పాటు జీవధ్వజ ప్రతిష్ఠ, గర్భాలయ విమాన శిఖర ప్రతిష్ఠ, మహా కుంభ సంప్రోక్షణ కార్యక్రమాలు జరుగుతాయి. త్రిదండి చిన రామానుజ జీయర్‌స్వామి మంగళశాసనాలతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో దేవదాయశాఖ, భక్త బృందం సంయుక్త ఆధ్వర్యంలో.. తొలి రోజు శనివారం ఉదయం గం.6.30కి అరణిమందనం, అగ్ని ప్రతిష్ఠ, ఛాయాధి వాసం, సాయంత్రం గం.5-30ని.లకు ఆలయ వాస్తుశాంతి, జలాధి వాసం నిర్వహిస్తామని, ఆదివారం ఉదయం కర్మాంగ స్నపనం, నయన్మోలీనం సాయంత్రం శయ్యాధివాసం, తత్వన్యాస హోమం, గర్తపూజ, రత్నన్యాసం, యంత్ర బింబస్థాపన సోమవారం మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, ప్రాణప్రతిష్ఠ, ప్రధమారాధన, శాంతికల్యాణం, నివేదన, అన్న సంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో హరి దుర్గాప్రసాద్ తెలిపారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. భక్తులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



దేవాలయంలో సిద్ధం చేసిన యాగశాల



విస్తృత ఏర్పాట్లు

శ్రీధనశైల సీతారామస్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠ, జీవధ్వజ ప్రతిష్ఠల సందర్భంగా పట్టణంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ముక్త్యాల రోడ్డులో బంగారపు కొట్ల సెంటర్ నుంచి దేవాలయం వరకు ప్రత్యేక పందిళ్ల వేశారు. యాగశాలను నిర్మించారు. నూతన ఆలయాన్ని సర్వాంగ శోభితంగా తీర్చిదిద్దారు.



బందోబస్తుపై సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ గిరిబాబు

ఉప ఎన్నికకు బందోబస్తు ఏర్పాట్లు

తిరువూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఉప ఎన్నిక జూన్ 2న జరగనున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లలో స్థానిక పోలీసు అధికారులు నిమగ్నమయ్యారు. శుక్రవారం సీఐ గిరిబాబు, ఎస్ఐ కేవీజీవీ.సత్యనారాయణలు సిబ్బందితో, మున్సిపల్ కార్యాలయం మీదుగా వెళ్లే రహదారితో పాటుగా, కార్యాలయ పరిసరాల్లో బందోబస్తు, బారికేడ్ల ఏర్పాట్లపై సీఐ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మైనింగ్ కేసులో రంగాకు ముగిసిన పోలీస్ కస్టడీ

గన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మైనింగ్ కేసులో ఏ-2గా ఉన్న ఓలుపల్లి మోహన రంగా పోలీసుల రెండు రోజుల కస్టడీ శుక్రవారం ముగిసింది. రెండోరోజు పోలీసులు 20 నుంచి 25 ప్రశ్నలు వేయగా ప్రతిదానికి తనకేమీ తెలియదని, తానుగా ఏ తప్పు చేయలేదని, ఎవరైనా చేశారేమో తనకు తెలియదని చెప్పినట్టు సమాచారం. విచారణ అనంతరం రంగాను గన్నవరం స్టేషన్ నుంచి విజయవాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో ఏమైనా ఇబ్బందులు పెట్టారా అని న్యాయమూర్తి అడగ్గా ఏమీ లేదని చెప్పాడు. అనంతరం రంగాను జిల్లా జైలుకు తరలించారు.

నరదిష్టి పేరుతో బంగారం చోరీ

బెంజ్‌సర్కిల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నరదిష్టి తగలింది.. దిష్టి తీయాలి.. నరదిష్టి పోవాలంటే అన్నదానం చేయాలని మాట కలిపారు.. దేవుడు చందా వేయండని రూ.వెయ్యి తీసుకున్నారు.. దిష్టి తీస్తానని ఉంగరంతో ఉడాయించారు.. ఈ ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. అయ్యప్పనగర్‌కు చెందిన పరుచూరి రాజబాబయ్య వైద్యపరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బందర్‌రోడ్డుపై ఆటో కోసం వేచిచూస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై భవానీ మాల ధరించి ఆయన వద్ద ఆగారు.. చందా వేయండని మాట కలిపి వారి వద్ద ఉన్న పుస్తకం తీసి చందా పేరుతో రాజబాబయ్య నుంచి రూ.వెయ్యి తీసుకున్నారు.. మీకు నరదిష్టి తగిలిందని పూజలు చేయాలని అందుకు రూ.18 వేలు ఖర్చు అవుతాయని నమ్మబలికారు. అంత నగదు తన వద్ద లేవని సమాధానం చెప్పడంతో.. మాల ధరించిన ఒకరికి దేవుడు పూనినట్టు నమ్మించి బంగారంతో దిష్టితీసి ఇస్తానని నమ్మించాడు. ఈ క్రమంలో బాధితుడు తన దగ్గర ఉన్న సుమారు 8 గ్రాముల బంగారు ఉంగరాన్ని తీసి అతని కండువాలో వేశాడు.. వెనక్కి తిరిగి నిలబడండని మరోవ్యక్తి చెప్పడంతో అందుకు రాజబాబయ్య నిరాకరించారు.. ద్విచక్రవాహనంపై వేగంగా వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ కిడ్నాప్.. విడుదల

విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ విశాలాంధ్ర రోడ్డులో ఉన్న శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ కిడ్నాప్ నగరంలో కలకలం రేపింది. ఈ కళాశాల భూమికి సంబంధించి కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రిన్సిపాల్ వంకాలపాటి శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం ఎంజీ రోడ్డులో ఉన్న డిఅడ్రస్ మాల్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ఆయనను గుంటూరు జిల్లాకు చెందిన ఒక నాయకుడి అనుచరులు ఎత్తుకెళ్లినట్టు శ్రీనివాసరావు కుమారుడు శ్రీహరి సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గుంటూరు జిల్లాకు చెందిన శ్రీధర్, రాజేష్ తమ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారని, సాయంత్రం షాపింగ్‌కు వెళ్లిన తన తండ్రి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు ఆయన సెల్‌ఫోన్‌ను ట్రాక్ చేయగా డిఅడ్రస్ మాల్ వెనుక ఒక భవనంలో ఉన్నట్లు గుర్తించారు. కృష్ణలంక పోలీసులు అక్కడికి చేరుకోవడంతో శ్రీనివాసరావును విడిచిపెట్టారు. దీనితో కిడ్నాప్ కథ సుఖాంతమైంది.

వంతెనలు వచ్చేస్తున్నాయ్!

- సెంట్రల్‌లో ఐదు ఆర్వోబీలు!
- నియోజకవర్గానికి కొత్తకళ
- రైల్వేశాఖతో సంయుక్త కార్యాచరణ
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ నియోజకవర్గంలో నున్న వరకు ఏలూరు రోడ్డుకు అనుకుని సత్యనారాయణపురం, గవర్నరుపేట, సీతారాంపురం, చుట్టుగుంట, గాంధీనగర్‌లు నగరంలో ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని అజిత్ సింగ్‌నగర్, మధురానగర్, దేవీనగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, రాజరాజేశ్వరిపేట, నున్న ప్రాంతాలు నగరానికి దూరంగా ఉంటాయి. నియోజకవర్గ భౌగోళిక స్థితికి అటు, ఇటుగా ఏలూరు రోడ్డు, బుడమేరు, రైవస్ కాలువలు పలు ప్రాంతాల మధ్య నుంచి ప్రవహిస్తాయి. అజిత్‌సింగ్‌నగర్ నుంచి నగరంలోకి రావాలంటే ఫ్లైఓవర్ ఒక్కటే మార్గం. ప్రస్తుతం బుడమేరు వద్ద ఉన్న ఫ్లైఓవర్ కాలువకు అటు ఇటు ఉన్న



మధురానగర్ వద్ద నిర్మించిన రైలు వంతెన

ప్రాంతాలను కలుపుతుంది. వీటి మధ్య నుంచి రైల్వేలైన్ కూడా ఉండటంతో విజయవాడకు వచ్చే ప్రతి



అజిత్ సింగ్‌నగర్ నుంచి గుణదలకు వేయనున్న ఆర్వోబీ

రైలు అజిత్‌సింగ్‌నగర్, మధురానగర్‌ల మీదుగా వెళ్తుంటాయి. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్‌లు తక్కువగా ఉండడంతో ప్రభుత్వం ఆర్‌ఓబీలపై దృష్టి పెట్టింది. ఇప్పటికే బుడమేరు ఫ్లైఓవర్ కింద ఒక ఆర్‌ఓబీ, మధురానగర్ ఫ్లైఓవర్ కింద మరొకటి నిర్మించారు. అయితే నియోజకవర్గ పరిధిలో మరో ఐదు ఆర్‌ఓబీలను నిర్మించేందుకు రైల్వే శాఖతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

నిర్మాణానికి సిద్ధమవుతున్న ఆర్‌ఓబీలు

సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఐదు ఆర్‌ఓబీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అవి అజిత్ సింగ్‌నగర్ డబుల్ ఫ్లైఓవర్, వాంబేకాలనీ ఫ్లైఓవర్, ఎల్‌సీ నెంబర్ 316, గుణదల ఫ్లైఓవర్, పప్పులమిల్లు సెంటర్. వీటిని 2029 ఎన్నికల నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గుణదల ఆర్‌ఓబీకి అన్ని అనుమతులు ఇచ్చి ఎస్టిమేషన్ రూపొందించి రైల్వే అధికారులకు పంపింది. గుణదల ఆర్‌ఓబీలో విద్యుత్ లైన్ వందశాతం ఫండింగ్‌తో రైల్వేశాఖ మార్చే విధంగా ఎస్టిమేషన్‌ను సిద్ధం చేసింది. అలాగే మున్సిపల్ డ్రైనేజీ పంపు చేయాలని కోరుతూ మరో ఎస్టిమేషన్ ఇచ్చారు. అలాగే కేర్ అండ్ షేర్, డేపండమ్ స్కూల్ ఎల్‌సీ నెంబర్ 316 దగ్గర ఆర్‌ఓబీకి కూడా అప్రూవల్ వచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం క్లియరెన్స్‌లన్నీ ఇప్పటికే ఇచ్చింది. మిగతా వాటికి ఎస్టిమేట్‌లను రూపొందించి వీలైనంత త్వరగా నిర్మాణాలను పూర్తి చేసే పనిలో ఉంది.

వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



నియోజకవర్గంలో ఆర్‌ఓబీలను వీలైనంత త్వరగా నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఆర్‌ఓబీలకు సంబంధించిన ప్రాథమిక అంచనాలతో తయారుచేసిన ఫైలు హైదరాబాద్‌లోని సీఈ ఆఫీసుకు పంపడం జరిగింది. దీనితో పాటు పప్పులమిల్లు సెంటర్ దగ్గర నిర్మించబోయే ఆర్‌ఓబీ నేతాజీ రోడ్డు దగ్గరైతే అనుకూలంగా ఉంటుందని జేసీ రిపోర్ట్ ఇచ్చారు. ప్రతిపాదనల రిపోర్ట్‌ను తయారుచేసి జూన్ 3న ఎంపీ, కలెక్టర్, డీఆర్ఎం, ఆర్‌ఆర్‌బీ అధికారులతో సమావేశం నిర్వహించబోతున్నాం. ఐదు ఆర్‌ఓబీల పూర్తికి కేంద్రప్రభుత్వం సుమారు రూ.400 కోట్లు ఎస్టిమేషన్ తయారుచేయగా.. అప్రోచ్ రోడ్లు, స్థానిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.200 కోట్లు అదనంగా ఇవ్వడానికి అంగీకారం తెలిపింది. ఈ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతివారం రివ్యూ మీటింగ్ ఉంటుంది. 15 రోజులకొకసారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాజెక్టులను రివ్యూ చేయడం జరుగుతుంది. ఈ మేరకు శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సెంట్రల్ నియోజకవర్గ ఆఫీసులో రివ్యూ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌కు రైల్వే ఎస్ఎస్ఈ సీనియర్ సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి విజయ నూతన ఉత్పత్తులు

చిట్టినగర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్ (విజయా డెయిరీ) మార్కెట్‌లోకి నూతన ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. ఆవు, గేదె నెయ్యి 100, 200, 500 గ్రాములు, లీటరు బాటిల్స్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. శుక్రవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులతో కలిసి నూతన ఉత్పత్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృష్ణామిల్క్ యూనియన్ పాడి పరిశ్రమకు ఎంతో ప్రోత్సాహం ఇస్తుందన్నారు. విజయ డెయిరీకి దేశ విదేశాల్లో మంచి పేరు ఉందని, నాణ్యమైన నెయ్యి, ఇతర ఉత్పత్తులను మార్కెట్ తక్కువ ధరకే అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గం సమావేశంలో యూనియన్ ఆర్థికాభివృద్ధి, రైతుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించామన్నారు. సహకార రంగంలో గ్రామస్థాయి నుంచే ఆదాయ వనరులు పెరగాలన్నదే సీఎం చంద్రబాబు ఆలోచన అని, అలాగే యూనియన్ రైతులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. రైతులు పండించే ఇతర పంటల ద్వారా కూడా ఉత్పత్తులు తయారు చేయాలని నిర్ణయించామని, ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధర వస్తున్న అంశాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. ఈ అంశాలను ప్రభుత్వానికి వివరించి, త్వరలోనే కార్యాచరణ సిద్ధం చేసి రైతులు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చేయూతను అందిస్తామన్నారు. ఎండీ కొల్లి ఈశ్వరబాబు మాట్లాడుతూ, ఆరు దశాబ్ధాలుగా నాణ్యతా ప్రమాణాలతో పాలు పాలపదార్థాలు వినియోగదారులకు అందిస్తూ మన్ననలు పొందుతున్న యూనియన్ ఉత్పత్తులకు మంచి స్పందన వస్తుందన్నారు. ఆవు, గేదె నెయ్యి 100 గ్రాములు రూ.80, 200గ్రాములు రూ.160, 500 గ్రాములు రూ 330, లీటరు రూ. 650గా ధర నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు.



నూతన ఉత్పత్తులను విడుదల చేస్తున్న చలసాని ఆంజనేయులు, కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గసభ్యులు

ఇలా ఎప్పటికి పూర్తి చేస్తారు

(3వ పేజీ తరువాయి)

గోడ నిర్మాణం జరిగి తీరాలి అని స్పష్టం చేశారు. గడువులోగా పనులు పూర్తి చేయకుంటే ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెడతామని ఆయన కాంట్రాక్టు ఏజెన్సీకి నోటీసులు జారీ చేశారు. సీజన్‌లో బుడమేరుకు వచ్చే వరద వల్ల విజయవాడ పల్లపు ప్రాంతాలకు ఎలాంటి నష్టం జరగకూడదన్నారు. చాలా సీరియస్‌గా తీసుకోవాలని మూడు షిఫ్టులు 24 గంటలు పని జరగాలని ఆయన కాంట్రాక్ట్ ఏజెన్సీని, జలవనరులశాఖ అధికారులను హెచ్చరించారు. ఏం లేని రోజుల్లో నవ్యాంధ్ర ఏర్పడిన రోజున సీఎం చంద్రబాబు బస్సులో 10 రోజులు పడుకొని పని చేసిన రోజులు గుర్తు లేవా అని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివాగుకు వచ్చే వరదకు ఆపోజిట్‌లో బుడమేరు వరద మళ్లింపు (బీడీసీ) కాలువ ఉందని, అందువల్ల పులివాగుకు ఎప్పుడు వరద వచ్చినా గత ఏడాది వరదలకు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి 3.8 కిలో మీటర్ల వద్ద పడిన గండ్ల స్థానం వద్దే మరలా గండ్లుపడే అవకాశం ఉన్నందున అధికారులు, స్థానికులు చెప్పిన విషయాలను దృష్టి ఉంచుకొని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పర్మినెంట్‌గా ఒక సీసీ వాల్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా రూ.23 కోట్ల అగ్రిమెంట్ వాల్యూగా పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే మూడు సార్లు ఇక్కడకు వచ్చి పనుల్ని పరిశీలించి హెచ్చరించినా కాంట్రాక్టు సంస్థ కాని, అధికారులు కాని దీని యొక్క సీరియస్‌నెస్‌ను గుర్తించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో వర్షాలు ముమ్మరం అయ్యేలోగా రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

బెజవాడ బళ్లు.. ఏవోబీలో రయ్.. రయ్!

- గంజాయి కోసం దొంగిలిస్తున్న ముఠాలు
- నగరంలో ద్విచక్రవాహనాల చోరీ
- ఏవోబీ కొండ ప్రాంతాల్లో బేరం
- ఈ ఏడాది 185 బైకుల చోరీ
- వాటిల్లో గంజాయి కోసం 35-40 విక్రయించినట్టు గుర్తించిన పోలీసులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

విజయవాడలో ఇటీవలికాలంలో వరుసగా ద్విచక్ర వాహనాలు మాయమవుతున్న ఘటనల్లో సంచలన విషయం వెలుగుచూసింది. కొన్ని గ్యాంగ్‌లు నగరంలో బైకులను చోరీచేసి వాటిని వివిధ మార్గాల ద్వారా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) కొండలకు తరలించి.. అక్కడ గంజాయి కోసం అమ్మేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. దొంగలు ఖరీదైన బైకులనే ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారు. కొండలపైన ఇళ్లు ఉన్న వాళ్లు కింద ఉన్న మెట్లు, ర్యాంపుల వద్ద నిలిపి ఉంచిన బైకులపై ఎక్కువగా కన్నేస్తున్నారు. ఇటీవల పోలీసులు ఛేదించిన బైక్‌ల చోరీ కేసుల్లో ఎక్కువగా గంజాయి లింక్‌లు బయటపడ్డాయి. విజయవాడ నగరం, ఎన్టీఆర్ జిల్లాలో దొంగిలించిన వాహనాలను గంజాయికోసం తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం ఇలాంటి 20-25 గ్యాంగ్‌లు ఉన్నట్టు లెక్కలు తీశారు. నగరంలోని భవానీపురం, కొత్తపేట, చిట్టినగర్, మాచవరంలలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. కొండలపై ఇళ్లను నిర్మించుకున్న వారు వాహనాలను కింద ఉన్న మెట్లు, ర్యాంపుల వద్ద పెట్టుకుంటారు.

హ్యాండిల్ లాక్‌లను విరగ్గొటి..

గంజాయి కావాల్సినప్పుడల్లా దొంగలకు డబ్బుల కంటే ముందు బైక్‌లు కనిపిస్తున్నాయి. బైక్‌లను మాయం చేయడానికి ముందురోజు రాత్రి నగరంలో తిరుగుతూ ఇళ్ల బయట, వీధుల్లో రోడ్ల పక్కన నిలిపి ఉంచిన వాహనాల నుంచి పెట్రోలు దొంగిలిస్తున్నారు. ఆ మర్నాడు రాత్రి అసలు వేటకు బయలుదేరి.. ఎంచుకున్న ప్రాంతాల్లో ఖరీదైన బైక్‌లను మాయం చేస్తున్నారు. హ్యాండిల్ లాక్‌లను విరగ్గొట్టి, కొంతదూరం బైక్‌లను తోసుకుని వెళతారు. అక్కడ వైర్లసాయంతో ఇంజిన్‌ను స్టార్ట్ చేసుకొని వెళ్లిపోతారు. తర్వాత పెట్రోలు బాటిళ్లను బ్యాగ్‌లో పెట్టుకుని పర్యాటకుల మాదిరిగా రెండు బైక్‌లపై ఇద్దరు చొప్పున ఒడిశా ప్రాంతానికి పయనమవుతున్నారు.

సరిహద్దులు దాటి..

చోరీ గ్యాంగ్‌లు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మోతుగూడెం, సీలేరు, డొంకరాయి వైపుగా ఒడిశా సరిహద్దులకు వెళ్తున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా అల్లూరి జిల్లాలోని సీలేరు సరిహద్దులు దాటుతున్నారు. కొంత మంది తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి గోకవరం, రంపచోడవరం, మారేడుమిల్లి, తులసిపాక, మోతుగూడెం మీదుగా సీలేరు సరిహద్దులు దాటుతున్నారు. డొంకరాయి-సీలేరుకు మధ్య 16-18 వరకు గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇవన్నీ ఒడిశా సరిహద్దుల్లో కొండలపై ఉంటాయి. దొంగలు సరిహద్దులు దాటిన తర్వాత పర్యాటకుల్లా మారిపోతున్నారు. ఒకరోజు రాత్రంతా అక్కడి అడవుల్లో ఎంజాయ్ చేస్తూ గంజాయి ఏజెంట్ల గురించి వాకబు చేస్తున్నారు. ఏజెంట్లు చెప్పే ధరలను బట్టి లెక్కలు వేసుకుని ఒక బైక్‌ను వారికి ఇచ్చేస్తున్నారు. 5-10 కిలోల వరకు గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. పనిపూర్తయిన తర్వాత మరో బైక్‌పై తిరుగు ప్రయాణమవడం జరుగుతున్న తంతుగా ఉంది.

ఈ ఏడాది 185 బైకులు మాయం

ఈ ఏడాది ఇప్పటి వరకు విజయవాడలో మొత్తం 365 చోరీలు జరిగాయి. ఇందులో 185 బైక్‌లు మాయమయ్యాయి. పోలీసులు గంజాయి గ్యాంగ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా.. 35-40 బైక్‌లను ఒడిశా సరిహద్దుల్లోని కొండలపై గుర్తించారు. గంజాయిని తీసుకొచ్చేటప్పుడు మార్గమధ్యలో ఎక్కడైనా పోలీసులకు చిక్కితే దొంగలు అక్కడే బైక్‌ను వదిలేస్తున్నారు. పోలీసు చెక్‌పోస్టులు దాటుకుని జిల్లాకు చేరుకున్న తర్వాత ఆ వాహనానికి నకిలీ రికార్డులు తయారు చేసి, కాలేజీ విద్యార్థులకు తక్కువ ధరకు అమ్మేస్తున్నారు. లేకుంటే ఇతర జిల్లాల్లోని శివారు ప్రాంతాలకెళ్లి తుప్పల్లో పడేస్తున్నారు.

'జీపీఎస్ ట్రాకర్' డ్రైవ్ చేపట్టాం

కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న బైక్‌ల దొంగతనాలపై దృష్టి పెట్టినప్పుడు గంజాయి వ్యవహారాలు కనిపించాయి. ఇక్కడ దొంగిలించిన బైక్‌లను ఒడిశా సరిహద్దుల్లోకి తీసుకెళ్లి అమ్మేస్తున్నారు. ఆ డబ్బులకు గంజాయిని తెచ్చుకుంటున్నట్టు గుర్తించాం. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఇళ్లల్లో బైక్‌లను పార్కింగ్ చేసుకొనే పరిస్థితి లేదు. అందుకోసమే బైక్‌లకు జీపీఎస్ ట్రాకర్ ఏర్పాటు చేయించుకోవాలని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా విజయవాడలో కొండ ప్రాంతాలపై నివసిస్తున్న వారి బైక్‌లకు జీపీఎస్ ఏర్పాటు చేయిస్తున్నాం. కొత్తగా ఆర్ఎఫ్ఐడీ(రేడియల్ ఫ్రీకెన్సీ ఐడెంటిఫికేషన్) స్టిక్కర్లను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. అని బైక్ షోరూంలకు నోటీసులు ఇచ్చాం. కొత్తగా విక్రయించే బైక్‌లకు జీపీఎస్ ట్రాకర్ అమర్చాలని తెలియజేశాం.

- ఎస్వీ రాజశేఖరబాబు, సీపీ

బైక్ చోరీలకు 'చైన్' లాక్!

(ఆంధ్రజ్యోతి -విజయవాడ): చాలా మంది ప్రయాణికులు బస్టాండ్, రైల్వే స్టేషన్ వరకు ద్విచక్ర వాహనాలపై వెళ్తారు. అక్కడ స్కూటర్ స్టాండ్లలో వాహనాలను పెట్టకుండా బయట ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పార్క్ చేస్తారు. ఉదయం ఊరు వెళ్లి సాయంత్రానికి తిరిగి వచ్చేద్దామని ప్రయాణాలను రూపొందించుకున్న వారిలో ఎక్కువ మంది ఇదే పని చేస్తున్నారు. ఇలా పార్క్ చేసిన వాహనాలను చేతివాటం గ్యాంగ్ నిశితంగా పరిశీలిస్తోంది. ద్విచక్ర వాహనాలు పార్క్ చేయడం మొదలు వారు బస్సు, రైలు ఎక్కేవరకు అన్ని కదలికలను గమనిస్తోంది. ఆ తర్వాత బైక్‌లను మారుతాళాలతో అక్కడి నుంచి మాయం చేస్తున్నారు. ఇదంతా నాణేనికి ఒక వైపు. ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలను కొంతమంది రెక్కీ చేసి ఎత్తుకుపోతున్నారు. ఎండాకాలం కావడం, ఉక్కబోతలకు కుటుంబమంతా ఇళ్లలో ఏసీలు ఆన్ చేసుకుని గాఢ నిద్రలో ఉండడంతో అర్ధరాత్రి వీధుల్లో తిరుగుతున్న దొంగలు కనిపించిన వాహనాలను మాయం చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో గడచిన ఏడాది 230 మంది ద్విచక్ర వాహనాలు చోరీ అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 185 వాహనాలు మాయమయ్యాయి. బహిరంగ ప్రదేశాల్లో ఖాళీ ఉంటే వాహనాలను పెట్టేసి ఎక్కడెక్కడికో వెళ్లిపోతున్న వారికి భద్రత భరోసాను ఇవ్వడానికి పోలీసులు ఇనుప గొలుసులను ఉపయోగిస్తున్నారు. కిలోమీటరు, రెండు కిలోమీటర్ల దూరానికి సరిపడే విధంగా ఇనుప గొలుసులను కిలోల లెక్కన కొనుగోలు చేస్తున్నారు. రెండు కొనల వద్ద తాళం వేసేవిధంగా రింగ్‌లను అమర్చుతున్నారు. ఆ గొలుసులను వాహనాల చక్రాల మధ్య నుంచి తీసుకెళ్లి రెండు కొనలను కలిపి తాళం వేస్తున్నారు. ఇలా ఎన్ని వాహనాలు ఉంటే అన్ని వాహనాలకు గొలుసులను అల్లేసి తాళాలు వేస్తున్నారు. దీనితో ఏ వాహనాన్ని ఇక్కడి నుంచి కదపలేని పరిస్థితి.

ఒరిజినల్ ఆర్‌సీ బుక్, డ్రైవింగ్ లైసెన్స్ చూపితేనే..

వాహనానికి సంబంధించిన యజమానులు వచ్చి వాటిని తీసుకోవాలంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఒరిజినల్ ఆర్‌సీ బుక్, డ్రైవింగ్ లైసెన్స్‌లను చూపించాలి. ఈ విధంగా చేస్తేనే బైక్ అన్‌లాక్ అవుతుంది. లేకపోతే లాక్‌లోనే ఉంటుంది. ప్రస్తుతం కృష్ణలంక, భవానీపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో గొలుసుల ప్రణాళికలను అమలు చేస్తున్నారు. భవానీపురం, కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ ప్రజల జీవన పరిస్థితులు ఇతర ప్రాంతాల వారి కంటే భిన్నంగా ఉంటాయి. ఇక్కడ ఇళ్లన్నీ కొండలపై ఉంటాయి. వారి వాహనాలను కొంతమేరకు మాత్రమే తీసుకెళ్లగలరు. ఆ తర్వాత పైన ఉన్న ఇళ్ల వాళ్లంతా వాహనాలను ఒకచోట నిలుపుకుని తాళాలు వేస్తారు. మరికొంత మంది ప్రధాన రహదారికి పక్కన ఉన్న ఖాళీ స్థలాల్లో పార్క్ చేస్తున్నారు. ఈ వాహనాలకూ గొలుసులను అల్లి తాళాలు వేస్తున్నారు.

బైక్ చోరీలు తగ్గాయి

బైక్‌లు చోరీ అవుతున్నాయని ఫిర్యాదులు పెరగడంతో చైన్‌లాక్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నాం. దీనివల్ల సత్ఫలితాలు కనిపించాయి. ముందుగా కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో అమలు చేశాం. ఇక్కడ బస్టాండ్ ఉంది. నిత్యం ఏదో ఒక ఫిర్యాదు బైక్ చోరీలపై వచ్చేది. ఇక్కడ ఇప్పుడు బైక్ చోరీలు తగ్గాయి. ఆ తర్వాత కొండ ప్రాంతాల్లో అమలు చేస్తున్నాం. సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రైల్వేస్టేషన్‌లోనూ దీన్ని అమలు చేస్తున్నాం.

- ఎస్వీ రాజశేఖరబాబు, పోలీస్ కమిషనర్

విషాదంగా విహారయాత్ర

(3వ పేజీ తరువాయి)

లక్ష్మీసహస్ర, సాయి చైత్ర(7) ఉన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలతో కలిసి విహారయాత్రకు ఊటీ వెళ్లారు. అక్కడ ఆనందంగా గడిపి తిరిగి వస్తూ శుక్రవారం వేకువజామున జోగులాంబ గద్వాల జిల్లా కోదండపురం సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డుపక్కనే ఆగి ఉన్న లారీని ఢీకొనటంతో కారు నుజ్జయింది. ప్రమాదంలో భార్య శ్రావణి, చిన్న కుమార్తె సాయిచైత్ర(7) అక్కడికక్కడే మృతి చెందారు. పెద్ద కుమార్తె లక్ష్మీసహస్ర తీవ్రంగా గాయపడగా, ఆమెను హైదరాబాద్‌కు తరలించించారు. వెంకట బాబీ ప్రాణాలతో బయటపడ్డాడు. లక్ష్మీసహస్ర 9వ తరగతి చదువుతుండగా, చిన్నారి సాయి చైత్ర రెండవ తరగతి చదువుతోంది. రోడ్డు ప్రమాద ఘటనతో చల్లపల్లిలో తీవ్ర విషాదం అలుముకుంది. తల్లీ కుమార్తె మృతదేహాలను స్వగ్రామమైన చల్లపల్లి తీసుకువస్తున్నారు.

నత్తనడకన..

(3వ పేజీ తరువాయి)

మంత్రాంగం నడుపుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రెండు మండలాలకు సంబంధించిన నివేదికలను తయారు చేసి త్వరితగతిన అందజేయాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వెలువడినట్లు గృహనిర్మాణశాఖ అధికారులు చెప్పుకుంటున్నారు. పెదపారుపూడి మండలానికి వచ్చిన ఇసుము, సిమెంటును అక్కడకు పంపకుండా, కంకిపాడులో దించేసి గుంపగుత్తగా విక్రయించేసిన అంశంపై ఇటీవల కాలంలో గృహ నిర్మాణశాఖ అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంలో పెదపారుపూడి మండల గృహ నిర్మాణ సంస్థ సిబ్బందిని జిల్లా కార్యాలయానికి పిలిపించి అధికారులు విచారణ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారి ఇనుము, సిమెంటును విక్రయించేశారని సిబ్బంది చెప్పారు. ఇందులో బాధ్యుడైన అధికారిపై చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గన్నవరం వైసీపీ ఇన్‌చార్జిగా పంకజశ్రీ?

- నేడు కార్యకర్తలతో సమావేశం

విజయవాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సతీమణి పంకజశ్రీ నియమితులయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. వంశీ జైల్లో ఉండడంతో నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాథుడు లేకుండా పోయాడు. ఈ పరిస్థితుల్లో పార్టీ వ్యవహారాలను నడిపించేందుకు వీలుగా వంశీ సతీమణిని రంగంలోకి దింపాలని వైసీపీ అధిష్టానం భావిస్తున్నట్లు సమాచారం. గన్నవరంలోని బుద్ధవరం రోడ్డులో వైసీపీ కార్యాలయం కొలువుదీరింది. దీనిని ఇటీవల కాలంలో ఆధునీకరించారు. ఈ పనులు జరుగుతుండగానే వంశీ అరెస్టై జైలుకు వెళ్లాల్సి వచ్చింది. ఈ కార్యాలయాన్ని శనివారం ఉదయం ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమానికి వైసీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని నానితో పాటు జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు హాజరు కాబోతున్నారు. ఎన్టీఆర్ జిల్లా వైసీపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలోనే పంకజశ్రీ పేరును ఇన్‌చార్జిగా ప్రకటిస్తారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

గడ్డి విత్తనాలు పంపిణీ



కంకిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి) : పశు పోషకులకు అవసరమైన గడ్డి విత్తనాలను 75శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామని కంకిపాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నే ధనరామకోటేశ్వరరావు (ధనయ్య) అన్నారు. సర్పంచ్ లాం సోనియాతో కలిసి పశుపోషకులకు గడ్డి విత్తనాలు, పశువుల దాణాను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధనయ్య మాట్లాడుతూ, రైతులు పశుపోషణపై దృష్టి పెట్టాల న్నారు. పశుపోషకులకు అవసరమైన షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సబ్సిడిపై నిర్మించి ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడుపుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ కె. మాధవరావు, ఉప్పలూరు వెటర్నరి సిబ్బంది జ్యోతి, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవలు అందించాలి

మునిసిపల్ కమిషనర్ భవానీప్రసాద్, టీడీపీ తాడిగడప అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు



ప్రతిభా పురస్కారాలు అందుకొన్న సిబ్బందితో కమిషనర్ భవానీ ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు

పెనమలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని ప్రజలకు అత్యుత్తమ, మెరుగయిన సేవలు అందించడమే లక్ష్యంగా తాడిగడప మునిసిపాలిటీ, సచివాలయ సిబ్బంది పని చేయాలని మునిసిపల్ కమిషనరు భవానీప్రసాద్, టీడీపీ తాడిగడప అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావులు పిలుపునిచ్చారు. శుక్రవారం పోరంకి ఆలపాటి గార్డెన్స్‌లో మునిసిపల్ సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి జరిగిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలో వారు పాల్గొని మాట్లాడారు. తాడిగడప మునిసిపాలిటీ ఏర్పడిన నాలుగేళ్లలోనే రాష్ట్రంలోని మిగతా మునిసిపాలిటీలతో పోలిస్తే అభివృద్ధిలో తాడిగడప పోటీ పడే స్థాయికి చేరిందని, ఈ ఘనత పూర్తిగా వివిధ విభాగాల సిబ్బంది, అధికారులకే చెందుతుందని పేర్కొన్నారు. వివిధ శాఖల సిబ్బంది, అధికారులు పూర్తి సమన్వయంతో తమ బాధ్యతలు నిర్వర్తించినప్పుడే ఇది సాధ్యమని తెలిపారు. తాడిగడప మునిసిపాలిటీ అభివృద్ధిలో, సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే సహకారం పూర్తిగా ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యేను సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, ఈఈ భూషణంలు మాట్లాడుతూ, తమ విభాగాల అత్యుత్తమ పనితీరును ప్రశంసించారు. తాము అధికారులుగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి శక్తి వంచన లేకుండా పని చేస్తూ, సిబ్బందితో పనిచేయిస్తున్నామని తెలిపారు. పారిశుధ్యం విషయంలో గతంతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మునిసిపాలిటీలోని రోడ్లు, డ్రైన్ల ఏర్పాటు, మరమ్మతులపై పూర్తిగా దృష్టి పెట్టిందని, పనులు శరవేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మునిసిపాలిటీలో అత్యుత్తమ సేవలు అందించిన సిబ్బంది, సచివాలయ సిబ్బందికి పురస్కారాలు అందజేశారు.



మానికొండలో యోగా సాధన చేస్తున్న ట్రైనర్లు



జంక్షన్ లయన్స్‌క్లబ్‌లో నిర్వహిస్తున్న యోగా శిక్షణ

యోగా సాధనతో ఆరోగ్యానికి మేలు



ఉయ్యూరు పాత షాదీఖానాలో మహిళలకు యోగాభ్యాసాలు నేర్పుతున్న శిక్షకులు

ఉయ్యూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : దైనందిన జీవితంలో యోగాకు కొంత సమయం కేటాయించి యోగాభ్యాసన చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని యోగా గురువు, సాత్విక్ యోగా శిక్షకుడు జి. కృష్ణ అన్నారు. జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పాత షాదీఖానాలో కుట్టు నేర్చుకుంటున్న మహిళలకు యోగాభ్యాసన నేర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యోగా దినోత్సవం ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో ఉయ్యూరు పట్టణ, మండల పరిధి గ్రామల్లో యోగాభ్యాసన చేసేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఉంగుటూరు : యోగా ప్రక్రియను ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో ఒక భాగం చేసుకోవటం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ అన్నారు. యోగా మాస్టర్ ట్రైనర్ షేక్ మౌలాలీ ఆధ్వర్యంలో మానికొండ, తరిగొప్పల, వేంపాడు సచివాలయాల పరిధిలో రిజిస్టర్ చేసుకున్న సుమారు 36మంది ట్రైనర్లకు శుక్రవారం మానికొండ సచివాలయం ప్రాంగణంలో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు వి.సూర్యప్రకాష్‌నాథ్, కె.సాయికిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : ఆరోగ్యాంధ్ర లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1నుంచి 21 వరకు గ్రామాల్లో నిర్వహిస్తున్న యోగాభ్యాసన కార్యక్రమాల్లో ప్రజలు చురుగ్గా పాల్గొని జయప్రదం చేయాలని బాపులపాడు మండల పరిషత్ ఏవో త్రినాధరావు విజ్ఞప్తి చేశారు. యోగాంధ్ర 2025లో భాగంగా స్థానిక లయన్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల యోగ శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఏవో పాల్గొన్నారు. ఆయనతో పాటు బాపులపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరరావు,వివిధ శాఖల అధికా రులు, పంచాయతీ కార్యదర్శులు ,సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. కాగా మండ లంలోని పలు గ్రామాల్లో సచివాలయాలు వద్ద యోగాంధ్ర కార్యక్రమం అవగాహన కల్పిస్తు పలు బాలబాలికలు, యువతీ యువకులకు యోగా పోటీలు నిర్వహించారు.

గన్నవరంలో వికసించిన బ్రహ్మ కమలం



గన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : హిమాలయాల్లో ఉండే బ్రహ్మకమలం జనారణ్యంలో ఒక పువ్వు పూయడమే విశేషం. ఏకంగా పది పువ్వులు వికసించి పలువురిని ఆకర్షించిన వైనం కృష్ణాజిల్లా గన్నవరంలో శుక్రవారం రాత్రి జరిగింది. విశ్రాంత రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ దొండపాటి సాంబశివరావు సోదరి స్వరాజ్యం గన్నవరం విద్యానగర్‌లో ఉంటున్నారు. పూజనీయంగా భావించే బ్రహ్మకమలం మొక్కను గత ఐదేళ్లుగా పెంచుతున్నారు. ప్రతి ఏటా ఆ చెట్టుకు ఒక పువ్వు పూసేది. ఈసారి ఆ చెట్టుకు పది మొగ్గలు వచ్చాయి. అవి కొద్ది గంటల్లోనే వికసించి అందరిని కనువిందు చేశాయి. చుట్టు పక్కల వారు ఆసక్తిగా చూశారు.



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం నేత శీలం నారాయణరావు

ఉగ్రవాదం, మతోన్మాదం ప్రమాదకరం

ఉయ్యూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదం, మతోన్మాదం దేశానికి అత్యంత ప్రమాదకరమని స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం దేశానికి ప్రతీకలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శీలం నారాయణరావు అన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదం అనే అంశంపై స్థానిక శ్రామికభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీ దాని అనుబంధ పార్టీలు మతోన్మాదక చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో మతసామరస్యం వెల్లివిరిసేలా దేశ సమగ్రత, సమైఖ్యత కాపాడుకునేందుకు దేశ భద్రతపై చర్యలు ఉండాలన్నారు. పార్టీ నాయకులు కె.శివనాగేంద్రం అధ్యక్షతన జరిగిన సదస్సులో బి. రాజేశ్, కీర్తి, యూటీఎఫ్ జిల్లా నాయకుడు పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడి గాయపడ్డ వ్యక్తి మృతి

పెనమలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతూ డివైడరు పైనుంచి రోడ్డుపై పడి గాయాల పాలై వ్యక్తి మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కానూరు కామయ్య తోపు ప్రాంతానికి చెందిన షేక్ షబీర్ బాషా(35) ఈ నెల 17న కామయ్యతోపు సెంటర్ వద్ద ఉన్న డివైడరు ఎక్కి రోడ్డు దాటడానికి దిగుతుండగా రోడ్డుపై పడిపోయాడు. దీంతో తల భాగంలో, కంటి భాగంలో బలమయిన గాయాలై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.



కోడూరుపాడు ఆర్‌యూబీలో లైట్లు బిగిస్తున్న రైల్వే సిబ్బంది.. బయటకు కనబడుతున్న మోరీ

కోడూరుపాడు ఆర్‌యూబీలో వెలుగులు

ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన పనులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): కోడూరుపాడు ఆర్‌యూ బీ సమస్యపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన.. డేంజర్‌జోన్‌గా ఆర్‌యూబీ.. కథనానికి స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో అధికారులు యుద్ధప్రాతిప దికన దిద్దుబాటు చర్యలు చేపట్టారు. రైల్వే ఆధికారులు ఆర్‌యూబీని పరిశీలించి మోరీ (వర్షపునీరు బయటకు వెళ్లే తూము) బాగు చేయించడంతో పాటు ఆర్‌యూబీలో లైట్లను అమర్చారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో ఎంపీడీవో జోగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అంజనేయులు పనులను శుక్రవారం పరిశీలించారు. 4 లైట్లను వివిధ ప్రదేశాల్లో అమర్చడం ద్వారా ఆర్‌యూబీ మొత్తం వెలుగు నిండిపోయిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మోరీ బాగు చేయడంతో వర్షపు నీరు నిలువ ఉండటం లేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామాన్ని పీడిస్తున్న సమస్యను పరిష్కరించినందుకు ఆంధ్రజ్యోతికి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు సూర్య నారాయణ, చందు శ్రీనివాసరావు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెరటి తోటల పెంపకంపై దృష్టిసారించాలి

ఉంగుటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : పెరటి తోటల పెంపకం(కిచెన్ గార్డెన్స్)పై గ్రామీణ ప్రాంతాల మహిళలు దృష్టి సారించాలని టీన్ మిషన్స్ ఇన్ ఇండియా డైరెక్టర్ పులిపాక సుధాకర్ అన్నారు. ఆత్కూరులోని టీన్ మిషన్స్ ఇన్ ఇండియా సేవా ప్రాంగణంలో శుక్రవారం పెరటితోటల పెంపకంపై మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. జడ్పీఎన్ఎఫ్ ఎల్ 2లు సంధ్యా, రమాదేవి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి మొక్కల పెంపకం - సంరక్షణ, అందించాల్సిన పోషకాల గురించి అవగాహన కల్పించారు. విశ్వప్రజ్ఞ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సురేష్ , గన్నవరం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ డీలర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని సుమారు 50మంది గృహిణులకు పెరటి తోటల్లో పండించే 12రకాల కూరగాయల విత్తనాల ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. టీన్ మిషన్స్ ఇన్ ఇండియా వైస్ చైర్మన్ టి.జైపాల్, వీఆర్‌ఏ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విత్తనాలు అందుకున్న మహిళలతో టీన్ మిషన్స్ ఇన్ ఇండియా ప్రతినిధులు



యార్లగడ్డ ఆదేశాలతో

డ్రెయిన్ల పూడికతీత

గన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న డ్రెయినేజీలో పూడిక పని కొనసాగుతుంది. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు కార్మికులు సిల్ట్‌ను కొంత తొలగించారు. డ్రెయినేజీ పూడికతీత పనుల్లో జాప్యం జరగడంతో అధికారులతో మాట్లాడి వెంటనే పూర్తిచేయాలని యార్లగడ్డ ఆదేశించారు. దీంతో పూడికతీత పనులను పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు మళ్లీ ప్రారంభించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రసాదంపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడులోని చిన్మయి 11కేవీ ఫీడర్ విద్యుత్ మరమ్మతుల శనివారం చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు చిన్మయ ఫీడర్ ఏరియా, వాటర్ ట్యాంకు రోడ్డు, పటేల్‌వారి వీధి, ఎస్‌బీఐ ఏరియా, రంగ బొమ్మ ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న నాయకులు

మంద కృష్ణమాదిగ పోరాటం స్ఫూర్తిదాయకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ ద్వారా జాతికి అండగా నిలబడి మంద కృష్ణమాదిగ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్ అన్నారు. బొమ్ములూరులో బాబుజగ్జీవన్ రామ్ విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజికోద్యమ శిఖరమైన మంద కృష్ణ మాదిగ ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారం అందుకోవడం ఉద్యమానికి దక్కిన గౌరవ మంటూ యువతతో కూడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పచ్చిగల్ల శ్రీనివాసరావు, గాలంకి అప్పారావు, వినయ్, పోలిమెట్ల వాసు, నడకుదురు నల్లయ్య, కోలంటి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.



చెరువు కట్టపై చెత్తవేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన ఈవో కిరణ్‌కుమార్

మద్దూరులో స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర

కంకిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి) : మద్దూరులో స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పండుగ వాతావరణంగా నిర్వహిస్తున్నామని ఈవో చింతా కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామ పరిధిలో కట్ట ప్రాంతంలో ఉన్న వ్యర్థాలను తొలగించి శుక్రవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవో చింతా కిరణ్ కుమార్ మాట్లాడుతూ, మద్దూరు గ్రామ సర్పంచ్ చిప్పల దాసు ఆదేశాలకు అనుగుణంగా మద్దూరు పరిధిలో రోడ్డు సైడు ఉన్న చెత్తను తొలగించామన్నారు. గ్రామస్థులు మళ్లీ ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫెన్సింగ్‌తో పాటు ఆహ్లాదకరమైన మొక్కలు నాటి వాటిని పర్య వేక్షించే బాధ్యత పంచాయతీ చేపట్టిందని తెలియజేశారు.

ఎరువు తయారీ వేగవంతం చేయాలి

ఉంగుటూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : చెత్తసంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడంద్వారా గ్రామాలను స్వచ్ఛంగా, చెత్తరహితంగా మార్చడంతోపాటు పంచాయతీలకు ఆదాయం సమకూర్చడంపై ప్రభుత్వం దృష్టిసారించిందని ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని నాగవరప్పాడు, వెన్నూతల, తేలప్రోలు చెత్తసంపద కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ)ను శుక్రవారం సర్పంచ్ లాం దిబోరాతో కలిసి ఆయన పరిశీలించారు. తేలప్రోలులో తయారైన వానపాముల ఎరువుతోపాటు పొడిచెత్తను విక్రయించడంపై కార్యదర్శి ఎస్.రాజేంద్రవరప్రసాద్‌కు సూచనలు చేశారు.



రేషన్ షాపుల వద్దే సరకుల పంపిణీ

పెనమలూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వ్యానులు రద్దయినందున జూన్ 1నుంచి రేషన్ షాపుల వద్దే సరుకులు పంపిణీ చేస్తారని తహశీల్దారు గోపాలకృష్ణ తెలిపారు. రేషన్ షాపులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలవరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయని తెలిపారు. సరుకుల కోసం షాపులకు రాలేని 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, శారీరక వైకల్యం ఉన్నవారికి రేషన్ డీలర్ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 మధ్య ఇంటికే వచ్చి సరుకులు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.

ఉయ్యూరు : జూన్ 1 నుంచి రేషన్‌కార్డుల వారికి చౌకధరల దుకాణాల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. చౌకధరల దుకాణంలో నిత్యావసర సరుకు పంపిణీ చేసే సమయాలు, డీలర్ పేరు, ఫిర్యాదులు చేసే ఫోన్ నంబర్లు ఇతర వివరాల బోర్డును కడవకొల్లు వీరవల్లిమొఖాసా దుకాణంలో శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఈ పోస్ యంత్రం పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేర పారదర్శకంగా సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌కు సూచించారు.

కంకిపాడు : జూన్ మొదటి తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ భవన్నా రాయణ చెప్పారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, జూన్ ఒకటి నుంచి రేషన్ షాపుల ద్వారా ప్రజలకు రేషన్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు.

రుతుపవనాల రాకతో తొలకరి వర్షాలు ఆరంభమయ్యాయి. దీంతో చందర్లపాడు మండలం గుడిమెట్లలో వజ్రాల వేట మొదలైంది. అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వస్తున్న ఔత్సాహికుల రాకతో గుడిమెట్ల సందడిగా మారింది. తొలకరి వర్షాలు పడినప్పుడల్లా వజ్రాల అన్వేషకులు, స్థానికులు గుడిమెట్లకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్వేషణ సాగిస్తుంటారు. ప్రస్తుతం తొలకరి పులకరించడంతో భారీ సంఖ్యలో ప్రజలు వజ్రాల వేటకు వస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో వజ్రాల అన్వేషణపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..





గుడిమెట్ల వద్ద కృష్ణానది, వజ్రాల కోసం వెదుకుతున్న మహిళలు

వజ్రాల వేట!

తొలకరి పలకరింపుతో కృష్ణా తీరం వెంబడి పొలాల్లో వెదుకులాట ● గుడిమెట్లకు భారీగా తరలివచ్చిన అన్వేషకులు, స్థానికులు



వజ్రాల కోసం వెదుకులాడి, అలసిపోయి, చెట్ల కింద విశ్రాంతి తీసుకుంటున్న ఇతర ప్రాంతాల వారు

మూలన పడిన ఎన్ఎండీసీ ప్రాజెక్టు

వజ్రాలు దొరుకుతుండటంతో నేషనల్ మినరల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ప్రత్యేకంగా ఒక ప్రాజెక్టును నెలకొల్పింది. కొన్నేళ్ల క్రితం చందర్లపాడులో వజ్రాలను గుర్తించేందుకు యంత్రాలను ఏర్పాటు చేసింది. యాభై మంది ఉద్యోగులు ఉండేవారు. ఆ ప్రాంతంలో మట్టిని, రాళ్లను తెచ్చి శుద్ధి చేసేవారు. కొద్ది సంవత్సరాల తర్వాత ప్రాజెక్టు మూలనపడింది. ఖర్చు తప్పితే ఆశించిన విధంగా పెద్ద సంఖ్యలో వజ్రాలు లభించనందున గిట్టుబాటు కాకపోవటంతో యంత్రాలను ఇతర ప్రాంతాలకు తరలించారు.

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల): కృష్ణా తీరం వజ్ర సంపదకు నిలయం. నదీ పరివాహక ప్రాంతంలో గతంలో విలువైన వజ్రాలు దొరికాయి. ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో ఇంతకు ముందు తవ్వకాలు కూడా జరిగాయి. ఇప్పటికీ తీరగ్రామాల్లో అడపాదడపా వజ్రాలు దొరుకుతూనే ఉన్నాయి. వర్షాకాలంలో వజ్రాల కోసం ఎక్కువగా వెదుకుతుంటారు. వజ్రం దొరుకుతుందన్న ఆశతో స్థానికులే కాకుండా, దూరప్రాంతాల నుంచి వచ్చి, ఇక్కడే ఉంటూ గాలిస్తుంటారు.

ఖరీదైన వజ్రాలకు నెలవు

కృష్ణానది తీరంలో విలువైన వజ్రాలు దొరుకుతాయి అనడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. బ్రిటీష్ ప్రభుత్వం అధీనంలో ఉన్న, ఎంతో విలువైన, ప్రపంచ ప్రసిద్ధి చెందిన కోహినూర్ వజ్రం కూడా కృష్ణా తీరంలోనే దొరికింది.

పరిటాల కేంద్రంగా నిజాం పాలన

ఖరీదైన వజ్రాలు లభిస్తుండటంతో స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం నవాబు పరిటాల, మోగులూరు, బత్తినపాడు, గనిఆత్కూరు(ఈ నాలుగు గ్రామాలు కంచికచర్ల మండలం), చందర్లపాడు మండలం కొడవటికల్లు, ఉస్తేపల్లి, నూజివీడు దగ్గర ఉన్న మల్లవల్లి గ్రామాలను మాత్రం ఈస్ట్ ఇండియా కంపెనీకి అప్పగించలేదు. పరిటాల కేంద్రంగా పాలన చేశారు.

వర్షం కురిసిన మరుసటిరోజు నుంచి..

వజ్రాలు వర్షాకాలంలో ఎక్కువగా దొరుకుతుంటాయి. వర్షం కురిసిన మరుసటి రోజు ఎక్కువ మంది వజ్రాల కోసం వెదుకుతుంటారు. వర్షానికి మట్టి పైభాగం(పొర) కొట్టుకుపోతుంది. పొర కింద ఉండే వజ్రాలు బయటపడతాయి. మట్టి తవ్వకుండానే నిశితంగా పరిశీలిస్తూ వెదుకుంటారు. సాగుభూముల్లో కూడా వజ్రాలు దొరికాయి. రెండేళ్ల క్రితం పొలం దున్నుతుండగా కొడవటికల్లుకు చెందిన ఒక రైతుకు విలువైన వజ్రం దొరికింది. ఆ గ్రామంలోనే రెండు మూడు వజ్రాలు దొరికాయి. అంతకు ముందు ఉస్తేపల్లిలో ఒకరికి దొరికింది. వజ్రం దొరికిందంటే మూడో కంటికి కూడా తెలియనీయరు. తెలిస్తే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్న భయంతో చాలా జాగ్రత్తగా ఉంటారు. మధ్యవర్తుల ద్వారా వ్యాపారులను కలిసి విక్రయిస్తుంటారు. వజ్రాలు కొనేందుకు స్థానికంగా కూడా వ్యాపారులు ఉన్నారు.

ఇరవై ఏళ్ల క్రితం
రూ.కోట్లు పలికిన పరిటాల వజ్రం

పరిటాల గ్రామంలో వజ్రాల కోసం నిత్యం వెదుకుతూనే ఉంటారు. ఇంతకు ముందు పరిటాలలో విలువైన వజ్రాలు ఎక్కువగానే దొరికాయి. వజ్రాల వ్యాపారులు కూడా పరిటాల చుట్టూ తిరుగుతుండేవారు. రెండు దశాబ్దాల క్రితం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మించారు. రోడ్డుకు చెరువు మట్టి తోలుతుండగా, విలువైన వజ్రం దొరికింది. స్థానికంగా రూ.లక్షల్లో చేతులు మారగా, చివరగా ముంబై మార్కెట్లో రూ.కోట్లలో పలికింది. అప్పట్లో వజ్రాలు వెతికేందుకు వేలల్లో జనాలు రావడంతో అదుపుచేసేందుకు పోలీసులు నానాతంటాలు పడ్డారు. అడపాదడపా చిన్న చితకా వజ్రాలు దొరుకుతున్నాయి.

ఉదయం నుంచి
చీకటి పడేంత వరకు అన్వేషణ



రంగురాళ్లు

చందర్లపాడు మండలం గుడిమెట్ల (రామన్నపేట) కృష్ణా నది ఒడ్డున ఎర్ర మట్టితో కూడిన గట్టు పోరంబోకు ఉంది. మట్టిని తవ్వుతూ నిశితంగా పరిశీలిస్తూ మెరుస్తున్న రాళ్లను, రంగురాళ్లను ఏరుతున్నారు. తెల్లారటం ఆలస్యం గాలింపులో నిమగ్నమైపోతున్నారు. చీకటి పడేంత వరకు ఏరుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది అక్కడే వంట చేసుకుంటున్నారు. ఇక్కడ ఏడాది పొడవునా పదుల సంఖ్యలో జనాలు రాళ్లు ఏరుతుంటారు. ఐదు నెలల క్రితం గుంటూరు జిల్లాకు చెందిన ఒకరికి ఇక్కడ విలువైన వజ్రం దొరికింది. కొన్నేళ్ల క్రితం మూడు నాలుగు వజ్రాలు దొరికాయి.

డ్రైవర్ మావయ్య బ్లాక్‌మెయిల్ బుద్ధి

- బాలిక అసభ్యకర ఫొటోలు చూపించి డబ్బులు డిమాండ్.. పోలీసులకు ఫిర్యాదు
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

విజయవాడ/బెంజ్‌సర్కిల్, మే 30(ఆంధ్రజ్యోతి): మావయ్య అన్న పిలుపును అతడు మరో కోణంలో చూశాడు. బాలికను మాయమాటలతో లొంగదీసుకున్నాడు. బాలికను అసభ్యకరంగా చిత్రీకరించి ఆ ఫొటోలను చూపించి కుటుంబాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ఈ ఘటన విజయవాడలో జరిగింది. దర్శిపేటకు చెందిన కుటుంబం గడచిన ఏడాది ఏడాది సెప్టెంబరులో కృష్ణాజిల్లాలోని మంగినపూడి బీచ్‌కు వెళ్లింది. విజయవాడ నుంచి వెళ్లడానికి ఈ కుటుంబం ఒక క్యాబ్‌ను బుక్ చేసుకుంది. కైకలూరుకు చెందిన రాజు అనే యువకుడు డ్రైవర్‌గా వచ్చాడు. మంగినపూడి బీచ్‌లో ఈ కుటుంబంతో బాగా కలిసిపోయాడు. ఈ కుటుంబంలో మహిళను అక్క అని పిలవడం మొదలుపెట్టాడు. ఆమె తన కుమార్తెతో రాజును మావయ్య అని పిలిపించింది. అప్పటి నుంచి మావయ్య అని పిలుస్తుండేది. ఇక అప్పటి నుంచి ఈ కుటుంబంలో ఒక సభ్యుడిగా మెలిగాడు. కొద్దినెలల క్రితం ఆ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమెను రాజు ఇంటికి తీసుకొచ్చి తల్లిదండ్రుల వద్ద ఉత్తముడిగా మార్కులు వేయించుకున్నాడు. బాలికను తీసుకురావడానికి రూ. లక్ష వరకు ఖర్చులయ్యాయని రెండు దఫాలుగా రూ. 50వేల చొప్పున వసూలు చేశాడు. కన్న కుమార్తె ఇంటికి తిరిగొచ్చిందని ఆనందపడుతున్న సమయంలో తల్లిదండ్రులకు రాజు మరో ఝలక్ ఇచ్చాడు. బాలికను అసభ్యకరంగా చిత్రీకరించి కొద్దిరోజులుగా డబ్బులు డిమాండ్ చేయడం మొదలుపెట్టాడు. ఈ ఫొటోలు, వీడియోలు తన స్నేహితుడి వద్ద ఉన్నాయని అతడు డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని కథలు అల్లాడు. అడిగిన మొత్తం ఇవ్వకపోతే వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరిస్తున్నాడు. రోజూ డబ్బుల కోసం ఈ హింస పెరగడంతో బాలిక తల్లిదండ్రులు పటమట పోలీసులను ఆశ్రయించారు. రాజుపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

దానాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు

ఒంగోలులో అదనపు స్టాపు

రైల్వేస్టేషన్, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యం కోసం దానాపూర్-ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు ఒంగోలులో అదనపు స్టాపు కల్పిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'దానాపూర్ -ఎస్ఎంవీటి బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ (03251, 03259) జూన్ 1వ తేదీన అర్ధరాత్రి 1.28 గంటలకు ఒంగోలుకు చేరుకుని 1.30 గంటలకు బయలుదేరుతుంది. ఎస్ఎంవీటీ బెంగుళూరు-దానాపూర్ ఎక్స్‌ప్రెస్(03252, 03260) జూన్ 3వ తేదీన ఒంగోలుకు పగలు 11.58 గంటలకు చేరుకుని 12 గంటలకు బయలుదేరుతుంది.' అని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

16, 18న రద్దు..

బలార్షా-కాన్పూర్ మార్గంలో 3వ ట్రాక్ నిర్మాణ పనుల కారణంగా బెల్లంపల్లి యార్డులో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా 03251 దానాపూర్- ఎస్ఎంవీటి బెంగళూరు రైలును జూన్ 16వ తేదీన, 03252 ఎస్ఎంవీటీ బెంగళూరు-దానాపూర్ రైలును జూన్ 18వ తేదీన రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ ప్రకటించారు.



బీఆర్టీఎస్ రోడ్డులో కళాకారులతో కలిసి యోగాసనాలు వేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

యోగాను ప్రజలకు చేరువ చేయండి

- కళాకారులకు కలెక్టర్ లక్ష్మీశ సూచన

సత్యనారాయణపురం, మే 30(ఆంధ్రజ్యోతి): 'సమాజంలో మార్పు తెచ్చే శక్తి కళాకారులకు ఉంది. సంపూర్ణ ఆరోగ్యానికి సోపానమైన యోగాను ప్రదర్శనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయండి' అని కళాకారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రోడ్డులో శుక్రవారం కళాకారులతో కలిసి ఆయన యోగాసనాలు వేశారు. బీఆర్టీఎస్ రోడ్డుకు యోగా స్ట్రీట్ అని నామకరణం చేశామన్నారు. జూన్ 21 నాటికి యోగాను రాష్ట్రంలో 2 కోట్లమందికి, జిల్లాలో 10లక్షల మందికి చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఘంటసాల సంగీత కళాశాల ప్రిన్సిపాల్ నరసమ్మ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణ, నాట్యాచార్యుడు భాగవతులు వెంకటరామశర్మ, పలువురు నాట్యాచార్యులు గాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల ఆక్రమణల నిగ్గుతేల్చండి

- జీవో 60 ప్రకారం ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోండి
- అందులో దేవదాయశాఖ బోర్డులు ఏర్పాటు చేయండి
- ఆలయాల ఈవోలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ జి.లక్ష్మీశ, పక్కన దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, మే 30(ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ జిల్లాలో ఆక్రమణలకు గురైన దేవదాయశాఖకు చెందిన భూముల నిగ్గుతేల్చండి. జీవో 60 ప్రకారం ఆక్రమిత భూములను రెవెన్యూ అధికారులతో కలిసి స్వాధీనం చేసుకోండి. ఆ భూముల్లో దేవదాయశాఖకు చెందిన భూమిగా బోర్డులు పెట్టండి.' అని జిల్లాలోని ఆలయాల కార్యనిర్వహణాధికారులను కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో దేవదాయశాఖకు చెందిన భూముల అన్యాక్రాంతంపై పలు కథనాలు ప్రచురితమవడంతో ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈవో శీనానాయక్‌తో కలిసి మహామండపంలోని ఈవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, జిల్లా దేవదాయశాఖ అధికారి నటరాజన్ షణ్ముగం, జిల్లాలోని ఆలయాల ఈవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. దేవాలయాల భూముల వివరాలు, అన్యాక్రాంతానికి గురైన, కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివాదాల్లో ఉన్న దేవదాయశాఖ భూములపై స్థానిక రెవెన్యూ అధికారులతో చర్చించాలని సూచించారు. 15 రోజులకు ఒకసారి స్థానిక తహసీల్దార్‌తో కలిసి రెవెన్యూ అధికారులు, ఆలయాల ఈవోలు సమావేశం నిర్వహించాలన్నారు. దుర్గగుడికి సంబంధించిన ఆక్రమణలకు గురైన భూముల వివరాలను దుర్గగుడి ఈ.ఓ శీనానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో సీఐడీ ఎస్సై నత్తా కుమార్‌బాబు మృతి

- పోలుకొండలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



సంతాపసూచికంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

నందివాడ, మే 30 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి సీఐడీ విభాగంలో పని చేస్తున్న ఎస్సై నత్తా కుమార్‌బాబు(35) బ్రెయిన్ స్ట్రోక్‌తో విజయవాడ రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన స్వగ్రామమైన పోలుకొండలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. కుమార్‌బాబుకు తల్లి, భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. శుక్రవారం కుమార్‌బాబు కుటుంబసభ్యులను మంగళగిరి సీఐడీ విభాగం ఎస్పీ కృష్ణప్రసన్న, ఎస్పీ ఉమామహేశ్వరరావు, ఎస్పీ నగేష్, డీఎస్పీ రమణారావు, సీఐ పూర్ణ, ఎస్సై శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్వరరావు, ఎంపీపీ పెయ్యల ఆదాం తదితరులు పరామర్శించారు. సీఐడీ సబ్ ఇన్స్పెక్టర్లు, గ్రామస్థులు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ట్యాంకర్ల యజమానుల కన్నీరు

తొమ్మిది నెలలుగా బిల్లులు పడక ఆర్థిక ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి-నందిగామ) నందిగామ మునిసిపాలిటీలో మంచినీరు సరఫరా చేసిన ట్యాంకర్ల యజమానులు కన్నీరు పెడుతున్నారు. తొమ్మిది నెలలుగా బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. డ్రైవర్ల జీతాలు, వాహనాల డీజిల్ కోసం వడ్డీలకు తెచ్చి ప్రజలకు సకాలంలో మంచినీరు అందించారు. పది మందికి రూ.80 లక్షల వరకూ బిల్లులు నిలిచిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నందిగామ మునిసిపాలిటీలో పైప్‌లైన్లు లేని ఎగువ ప్రాంతాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందించారు. టెండర్ విధానంలో పది ట్యాంకర్లను తీసుకున్న మునిసిపాలిటీ ట్రిప్పుకు రూ.480 చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. ట్రాక్టర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేశారు. నెలకోమారు బిల్లులు ఇవ్వాల్సిన మునిసిపాలిటీ ఆ పని చేయలేదు. గతంలో వైసీపీకి చెందిన ఛైర్‌పర్సన్ ఉండడం, సకాలంలో కౌన్సిల్ సమావేశాలు జరగకపోడంతో బిల్లులు నిలిచిపోయేవి. ఇటీవల మునిసిపాలిటీని టీడీపీ దక్కించుకుంది. దాదాపు కౌన్సిలర్లంతా టీడీపీలో చేరారు. అన్నీ మారినా ట్యాంకర్ల యజమానులకు బిల్లులు చెల్లింపు విధానం మారలేదు.



మంచినీటిని సరఫరా చేస్తున్న అద్దె ట్యాంకర్లు(ఫైల్)

కౌన్సిల్ ఆమోదం రాగానే బిల్లుల చెల్లింపు: కమిషనర్

జరిగిన పూర్తి పని రికార్డు చేసి ఉంచామని, కౌన్సిల్ ఆమోదం రాగానే బిల్లులు అందజేస్తామని కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. అజెండాలో ఎందుకు చేర్చలేకపోతున్నారన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు.

పర్సంటేజీ ఇస్తేనే బిల్లు పాస్..
టీడీపీ నాయకుడి షరతు!

ట్యాంకర్ యజమానులు ఒత్తిడి మేరకు అధికారులు బిల్లులు పెట్టినా వాటిని కౌన్సిల్ అజెండాకు ఎక్కనీయకుండా కొందరు పాలకవర్గ సభ్యులు అడ్డుపడుతున్నారని తెలుస్తోంది. ఆ బిల్లులో అవకతవకలు ఉన్నాయని వాటిని చెల్లించాలంటే కొంత పర్సంటేజీ తమకు ఇవ్వాలంటూ స్థానిక టీడీపీ నాయకుడొకరు షరతు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను తలచుకుంటేనే ఆ అంశం అజెండాలో ఉంటుందని, అంత వరకూ బిల్లు నిలిచే ఉంటుందంటూ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. మునిసిపాలిటీలో రాజ్యాంగేతర శక్తిగా చక్రం తిప్పుతున్న ఆ వ్యక్తి రూ.ఐదు లక్షలు ఇస్తేనే ఆ బిల్లు పాస్ అవుతుందంటూ కొందరు అధికారుల వద్ద చెప్పుకొచ్చినట్లు సమాచారం. ఆ మేరకు సొమ్ము అందకపోవడం వల్ల రెండు సమావేశాల నుంచి ఆ బిల్లును అజెండాలోకి రానివ్వడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గం తీరుపై ట్రాక్టర్ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి పెట్టి మంచినీటిని సరఫరా చేశామని, బిల్లుల రాక వడ్డీలు చెల్లించలేకపోతున్నామని, ఇక పర్సంటేజీలు ఎక్కడి నుంచి తేవాలని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దృష్టికి తీసుకెళతామంటున్నారు. బిల్లులు చేసి రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకూ ఎందుకు కౌన్సిల్‌లో పెట్టలేదో మునిసిపల్ పాలకవర్గం ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. గడచిన రెండు కౌన్సిల్ సమావేశాల్లో ఈ అంశం అజెండాలోకి రాకపోవడానికి కొందరు నేతల అవినీతి ఆరాటమే కారణమంటున్నారు. అవసరమైతే పార్టీ అధిష్టానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనండి
- కృష్ణాజిల్లా ప్రజలకు కలెక్టర్ డీకే బాలాజీ పిలుపు



యోగాసనం వేస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): 'మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగసాధన చేయాలి. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు కృష్ణాజిల్లా ప్రజలు ముందుకు రావాలి. యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.' అని కలెక్టర్ బాలాజీ పిలుపునిచ్చారు. ఉదయపు నడక మిత్రమండలి హాలులో శుక్రవారం యోగా శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. శనివారం మంగినపూడి బీచ్‌లో యోగా ప్రత్యేక కార్యక్రమాన్ని 1,000 మందితో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 17 లక్షల మంది ప్రజలుండగా ఇప్పటికి 7 లక్షల మంది వద్దకు యోగా సర్వే వెళ్లిందని, అందులో 3 లక్షల మంది ఆసక్తి చూపారని ఆయన తెలిపారు. జూన్ 2న గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

యోగాంధ్ర కార్యక్రమాలకు రండి

- మంత్రి కొల్లు రవీంద్రకు ఆయుష్ ఆహ్వానం



మంత్రి కొల్లు రవీంద్రకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆయుష్ ప్రతినిధులు

యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని మంత్రి కొల్లు రవీంద్రను శుక్రవారం ఆయుష్ ప్రతినిధులు కె. వాహిని, భాగ్యలక్ష్మి ఆహ్వానించారు. జూన్ 2న గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం, 6న కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రం, 13న ఘంటసాల బౌద్ధరామం వద్ద, 19న మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో యోగ శిక్షణా కార్యక్రమాలను మంత్రి కొల్లు రవీంద్రకు ఆయుష్ ప్రతినిధులు వివరించారు.

తాగి తందనాలాడి సైకిళ్లను రోడ్డుపై పడేస్తారా

- దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి
- వైసీపీ నేతలకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమా హెచ్చరిక

గొల్లపూడి, మే 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి వివాహ రిసెప్షన్‌కు మాజీ సీఎం జగన్ వస్తే వైసీపీ ముసుగులో ఉన్న అరాచకశక్తులు తాగి తందనాలాడి సైకిళ్లను రోడ్డుపై పడేసి అరాచకం చేశాయని, జాతీయ రహదారిపై బాణసంచాలు కాల్చుతూ ట్రాఫిక్‌ను నిలిపివేశారని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగజారుడు రాజకీయాలు చేయొద్దని వైసీపీని హెచ్చరిస్తున్నామన్నారు. పోలీసులు దీనిపై కఠినంగా వ్యవహరించి ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. శుక్రవారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగళూరు ప్యాలెస్ నుంచి పెళ్లిళ్లు, తద్దినాలకు మాత్రమే వైసీపీ అధినేత జగన్ వస్తుంటారని, ఇక్కడకు వచ్చి ఏం చెప్పదలచుకున్నారో ఆయనకే తెలియదని దేవినేని ఉమా విమర్శించారు. జగన్మోహన్‌రెడ్డి మారడు అనే దశకు ప్రజలు వచ్చారన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో అనేక అరాచకాలు జరిగాయని ఉమా ఆరోపించారు. వేల కోట్ల రూపాయలు బయట రాష్ట్రాలు, దేశాలకు తరలించారని ఆరోపించారు. నాసిరకం మద్యంతో ఎంతో మంది చనిపోయారన్నారు. ఇవన్నీ న్యాయస్థానాల ముందుకెళితే అందులోని పాత్రధారులకు కనీసం బెయిల్ కూడా రాదన్నారు. కడప మహానాడులో ప్రవేశపెట్టిన నా తెలుగు కుటుంబంలోని ఆరు శాసనాల ఉద్దేశ్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ సూచించారని ఆరు శాసనాలను ప్రజలకు తెలియజేసేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలం విస్తృతంగా ప్రచారం చేస్తామని ఆయన తెలిపారు.

మూడెకరాల చెరువులో విషప్రయోగం

- చేపలు మృత్యువాత.. రూ.15 లక్షలు నష్టపోయామని రైతు కుటుంబం ఆవేదన



చెరువులో తేలుతున్న చేపలు, చెరువును పరిశీలిస్తున్న పోలీసు

బంటుమిల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదతుమ్మిడి గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ నాగమునీంద్రరావు చేపల చెరువులో మరో మారు విషప్రయోగం జరిగింది. దీంతో చేపలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన నాగమునీంద్రరావుకు జయపురం కాంప్లెక్స్‌రోడ్‌లో 3 ఎకరాల చెరువులో ఏడాది క్రితం రూ.4 లక్షల చేపల సీడ్‌ను చెరువులో వేసి సాగు చేస్తున్నారు. చిన్న చేపలుగా ఎదగడంతో వీటిని వేరే రైతులకు అమ్మకానికి బేరం పెట్టారు. ఈ తరుణంలో విషప్రయోగం జరిగి చేపలు చనిపోయి తేలియాడుతూ కనిపించాయి. దీంతో ఆ కుటుంబం బంటుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు చెరువును పరిశీలించి నీటి శ్యాంపిల్, చనిపోయిన చేపలను సేకరించారు. రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లిందని కుటుంబసభ్యులు వాపోతున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు తమపై కక్ష కట్టి చెరువులో మూడోసారి విషప్రయోగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టుబడి, అమ్మకాల సమయంలో విష ప్రయోగం చేస్తున్నారని, అప్పుల పాలయ్యామని, న్యాయం చేయాలంటూ వేడుకున్నారు.

నెప్పల్లిలో 4.41 ఎకరాల భూమి

కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీదే

- భూమిని విక్రయించలేదు..లీజుకు ఇచ్చాం
- అన్నసత్రం కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకట లక్ష్మీవరప్రసాద్

వన్‌టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా నెప్పల్లి గ్రామంలో ఆర్.ఎస్.నెం. 101లో 4.41 ఎకరాల భూమి వన్‌టౌన్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీకి చెందిందని కమిటీ అధ్యక్షుడు బచ్చు వెంకట లక్ష్మీవరప్రసాద్ తెలిపారు. శుక్రవారం కన్యకాపరమేశ్వరి అన్నసత్రం భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన కమిటీ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. కమిటీకి చెందిన నెప్పల్లిలోని భూమిపై వస్తున్న ఆరోపణలను ఖండించారు. ఈ భూమిపై వచ్చే కౌలు ఆదాయంతో 150 ఏళ్ల నుంచి కన్యకాపరమేశ్వరి అన్నసత్రానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు వసతి, ఉచిత భోజన సదుపాయాలు, సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సత్రానికి నెప్పల్లిలోనే కాకుండా విజయవాడ చుట్టుపక్కల గ్రామాల్లోనూ భూములు ఉన్నాయని, వాటిపై వచ్చే కౌలు ఆదాయంతో అన్నసత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నెప్పల్లిలోని భూమిని వందేళ్లకు పైబడి మూడు తరాలుగా దేవినేని దుర్గాప్రసాద్ కుటుంబం కౌలుకు తీసుకుని నిర్వహిస్తోందన్నారు. ఈ భూమికి సంబంధించిన పాస్ బుక్‌లు, భూమి శిస్తు, కౌలు రశీదులు 2004లో గ్రామ సెక్రటరీ ఇచ్చిన ధ్రువీకరణ పత్రం, రికార్డులన్నీ అన్నసత్రం కమిటీ వద్దే ఉన్నాయని తెలిపారు. ఈ భూమిని ఎవరికీ అమ్మలేదని, కేవలం అన్నసత్రం అభివృద్ధిలో భాగంగా 40 గజాల స్థలాన్ని పాతికేళ్లకు లీజుకు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అన్నసత్రం కమిటీ ప్రధాన కార్యదర్శి బయన శ్రీరాజేష్, ఉపాధ్యక్షుడు వల్లంకొండ వీరముని బ్రహ్మానందరావు, పాలక మండలి సభ్యులు, శారదా కళాపీఠం వ్యవస్థాపకుడు డోగుపర్తి శంకర్‌రావు పాల్గొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

మచిలీపట్నం టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన రిటైర్డు ఉపాధ్యాయుడు దేవేంద్ర రావుపై పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. విచారణ ప్రారంభించామని ఇనకుదురు సీఐ పరమేశ్వరరావు తెలిపారు. అప్పు తీర్చమని అడిగేందుకు వచ్చిన ఆ రిటైర్డు టీచరు ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను లైంగికంగా వేధింపులకు గురిచేశాడని, దీంతో ఆమె ఫ్యానుకు ఉరేసుకునేందుకు ప్రయత్నించిందని తాము రక్షించామని బాలిక తండ్రి ఇనకుదురు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్ 122, 131, 142
చికెన్ విత్ స్కిన్ 234
చికెన్ స్కిన్‌లెస్ 244
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510



జిల్లా స్థాయి యోగా కార్యక్రమం 2న

గుడివాడ, మే 30(ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర- 2025 కార్యక్రమాల్లో భాగంగా జూన్ 2వ తేదీన ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయి టీమ్ బేస్డ్ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు జూన్ 2వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లారీ, ఆటో, డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొంటారని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.





పామర్రు సదస్సులో మాట్లాడుతున్న సుధారాణి.. గుడివాడ మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి.. మొవ్వలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి

రైతులను సంపన్నులను చేయడమే లక్ష్యం

జిల్లా వికసిత్ సంకల్ప్ అభియాన్ సమన్వయకర్త డి.సుధారాణి

పామర్రు, మే 30 (ఆంధ్రజ్యోతి) : రైతన్నలను ఆర్థిక సంపన్నులుగా తయారు చేసి రైతేరాజుగా చూడాలన్నదే వికసిత్ కృషి సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యమని జిల్లా వికసిత్ సంకల్ప్ అభి యాన్ సమన్వయకర్త, సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త డి.సుధారాణి అన్నారు. పామర్రు వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం రైతులకు ఖరీఫ్ సాగులో చేపట్టాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు అధిక దిగుబడులు సాధించాలనే అత్యాశతో విచక్షణారహితంగా రసాయన పురుగుమందులు వాడి అటు పర్యావరణాన్ని కలుషితం చేస్తూ, ఇటు మానవ ఆరోగ్యాన్ని దెబ్బతీయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భూసారాన్ని కాపాడుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. భూసారాన్ని పెంపొందించుకోవడం కోసం పచ్చిరొట్ట ఎరువుల వినియోగం చేపట్టాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో జూన్ 12 వరకు వికసిత్ సంకల్ప యాత్రలు కొనసాగుతాయన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉండి, సాగులో మెళకువలు, డ్రోన్ల వంటి ఆధునిక పరిజ్ఞానం వినియోగంపై అవగాహన కల్పిస్తారన్నారు. డ్రోన్ వినియోగాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. జిల్లా యంత్ర సాంకేతిక అధికారి మనోహర్ ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలను వివరించారు. పామర్రు ఏడీఏ స్వర్ణలత ఖరీఫ్ సాగులో రైతులు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, నూతన వరి వంగడలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరులు కేంద్రం డిప్యూటీ డైరక్టర్ జ్యోతి రమణి, ఏడీఏ శ్రీనివాస్, కేంద్ర ఆయిల్‌పామ్ పరిశోధన శాస్త్రవేత్త అనిత, రేవతి రెడ్డి, శైలజ రాణి, పామర్రు మండల వ్యవసాయాధికారి వి.శివనాగరాణి, ఉండవల్లి ఆగ్రోస్ జనరల్ మేనేజర్ గరికపాటి శ్రీనివాస్, ఇఫ్కో, కోరమాండల్ కంపెనీ ప్రతినిధులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు

గుడివాడ రూరల్ : రైతులు మట్టి పరీక్షలు చేయించి, తదనుగుణంగాపంటలు సాగు చేసుకోవాలని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. గుడివాడ మార్కెట్ యార్డులో శుక్రవారం ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం జరిగింది. శాస్త్రవేత్తలు, వివిధ శాఖల అధికారులు రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వరిలో నూతన వరి వంగడాలపై అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి చేయటం ద్వారా తెగుళ్లు, చీడ పీడలు అరించవని తెలిపారు. ప్రతి రైతు ముందుగా మొలక శాతాన్ని పరీక్షించుకోవాలన్నారు. ఆయిల్ పామ్ పరిశోధనా శాస్త్రవేత్త డాక్టర్ సుబ్బన్న మాట్లాడుతూ గుడివాడ డివిజన్‌లో కూడా ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చన్నారు. ఉద్యానవన శాఖ అధికారిణి జె.కీర్తి మాట్లాడుతూ పెరటి మొక్కల పెంపకానికి రైతులు ఎక్కువ ప్రాముఖ్యతనివ్వాలన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవాలన్నారు. మత్స్యశాఖ శాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్, పశుసంవర్ధక శాఖ మండల అధికారి డాక్టర్ ఉన్నం హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం గేదెలు, గొర్రెలు, మేకలు, వ్యవసాయ సంబంధిత వ్యాపారాలు పెట్టుకోవటానికి, చేపల పెంపకానికి అనేక రకాల రుణాలు మంజూరు చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏవోలు బోలెం అనంతలక్ష్మి, అంజనేయరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పలువురు రైతులు శాస్త్రవేత్తలను అడిగి సమస్యలు నివృత్తి చేసుకున్నారు.

కూచిపూడి : సార్వా సాగులో రైతులు అనువైన వరి రకాలు ఎంపిక చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి పేర్కొన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం (ఘంటసాల) సంయుక్త ఆధ్వర్యంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, సార్వా సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మొవ్వ క్షేత్రయ్య కల్యాణ మండపంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకటలక్ష్మి మాట్లాడుతూ నారు పెంపు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవటంతోపాటు ఎలుకల యాజమాన్యం, కలుపు యాజమాన్యం, సస్యరక్షణ యాజమాన్యం, భూసార పరీక్షలు నిర్వహించటం తదనుగుణంగా సార్వా సాగు చేపట్టినట్లైతే అధిక దిగుబడులు సాధించటానికి ఆస్కారం ఏర్పడుతుందని తెలిపారు. డాక్టర్ బి.కల్యాణ్ బాబు ఆయిల్ పామ్ సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏడీఏ ఎస్.శ్యామల, ఏవో శివ ప్రసాద్, రాంబాబు తదితరులు సార్వా సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.



పామర్రులో డ్రోన్ వినియోగాన్ని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న శాస్త్రవేత్తలు

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

గుడివాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నందివాడ మండలం జనార్ధనపురం, పట్టణంలోని నాగవరప్పాడు, పోలీసు కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, లింగవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగాదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నవతరం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడిగా దుక్కిపాటి రాధాకృష్ణ

గుడివాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : నవతరం పార్టీ గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా దుక్కిపాటి రాధాకృష్ణ మూర్తిని నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. దుక్కిపాటి విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు.

ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ

పామర్రు,మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో జ్యోతి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఒక రోజు ముందుగానే శనివారం ఉదయం నుంచి ఇంటింటా పింఛన్లను గ్రామ సచివాలయ సిబ్బంది అందించే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు.



కలవపాముల వద్ద కూలిన వృక్షం

● స్తంభించిన ట్రాఫిక్

గుడివాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-విజయవాడ రహదారిలో కలవపాముల వద్ద జ్యోతి పాలిటెక్నిక్‌కు సమీపంలో శుక్రవారం రాత్రి పెద్ద వృక్షం రోడ్డుకు అడ్డంగా నెలకొరిగింది. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దాదాపు గంటపాటు అధికారుల కోసం వాహనదారులు, ప్రజలు ఎదురు చూశారు. ఎటువంటి స్పందన లేకపోవడంతో స్థానికులు, వాహనదారులు రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టు కొమ్మలను తొలగించారు.



నడిరోడ్డుపై కొట్టుకుంటున్న యువకులు

మద్యం మత్తులో కత్తులతో వీరంగం

గుడివాడ, మే 30(ఆంధ్రజ్యోతి) : ఫూటుగా మద్యం తాగిన ఇద్దరు యువకులు శుక్రవారం నీలామహల్ సెంటర్ నడిరోడ్డుపై కత్తులతో వీరంగంగా చేశారు. ఒకరినొకరు కొట్టుకుంటూ... చొక్కాలు లాగుతూ.... కత్తితో బెదిరిస్తూ... అడ్డుకో బోయిన వారిపై దాడి చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గంటసేపు ఇద్దరూ కొట్టుకుంటూ ట్రాఫిక్‌కు తీవ్ర అంత రాయం కలిగించారు. పోలీసుల రాకతో ఒకడు చొక్కా ఊడ దీసుకుని కత్తితో కోసుకుంటానని బెదిరింపులకు దిగాడు. మరొకడు ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు.



టి.నిఖితసాయికు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తున్న శ్రీకృష్ణదేవరాయ గ్రామాభివృద్ధి కమిటీ

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

పమిడిముక్కల, మే 30 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులకు ఐనంపూడికి చెందిన శ్రీకృష్ణదేవరాయ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ. 30 వేల నగదు ప్రోత్సాహక బహుమతి అందజేసింది. గ్రామానికి చెందిన తిరమలశెట్టి నిఖిత సాయి పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించగా కమిటీ తరపున రూ. రూ. 5 వేలు, ప్రతిభ చూపిన మరో 12 మందికి రూ. 25 వేలు ప్రోత్సాక బహుమతితో పాటు జ్ఞాపిక అందజేశారు. ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందజేస్తున్నామని కమిటీ సభ్యుడు శీలం రమేష్, గౌరవ అధ్యక్షుడు కొల్లి వెంకటప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్ బొల్లా వెంకటరత్నం తెలిపారు. గ్రామ సర్పంచ్ ఏనుగు బేబి, పి.శ్రీరామ్, గ్రామస్తులువిద్యార్థులను అభినందించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు.

రేపటి నుంచి రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ

పమిడిముక్కల, మే 30 (ఆంధ్రజ్యోతి) : జూన్ 1 నుంచి చౌకధరల దుకాణాల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. చౌకధరల దుకాణంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే సమయాలు, డీలర్ పేరు, ఫిర్యా దులు చేసే ఫోన్ నంబర్లు ఇతర వివరాల బోర్డు ను ఏర్పాటు చేశారు. ఈ పోస్ యంత్రాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేర పారదర్శకంగా సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. కార్డుదారులు వారికి అనుకూల సమయంలో రేషన్ తీసుకోవచ్చని, వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే నిత్యావసర సరుకులు డీలర్లు అందిస్తారన్నారు.

తోట్లవల్లూరు : రేషన్ వాహనాల వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసినందున జూన్ 1వ తేదీ నుంచి ప్రజలు రేషన్ దుకాణాలకు వెళ్లి బియ్యం, సరుకులు తెచ్చుకోవాలని తహసీల్దార్ ఎం కుసుమకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ షాపుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు డీలర్లు బియ్యం ఇస్తారని తెలిపారు.

సమస్యలను అధిగమించడంపై అవగాహన

పమిడిముక్కల, మే 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండి రక్షణ పొందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. ఝాన్సీరాణి అన్నారు. కృష్ణాపురం సెక్టార్ పాత ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్థిక పొదుపు, వివిధ సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. రక్తహీనత సమస్య ఎలా అధిగమించాల్లో ఎంఎస్‌కె శ్రీదేవి సవివరంగా తెలియజేశారు. అంగన్వాడీ టీచర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : పొదుపు చేయడం చిన్నతనం నుంచి అలవాటు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయ ఫ్లోరెన్స్ అన్నారు. కౌతవరం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్ర మంలో బాలికలకు ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు అంశంపై ఆమె అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌వాణి, ఎఎన్ఎంలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : మండలంలోని చౌటపల్లిలోని అంగన్‌వాడీకేంద్రంలో కిశోరి వికాసం వేసవి తరగతుల శిక్షణలో శుక్రవారం భాగంగా విద్యార్థినీలకు ఆర్థిక పొదుపులపై అంగన్‌వాడీ ఏ.డి నసీరున్నీసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయకురాలు రమాదేవి, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాపురం ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో కిశోరి బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఎం ఝాన్సీరాణి



కౌతవరంలో కిశోర బాలికలలకు శిక్షణ ఇస్తున్న సీడీపీవో విజయ ఫ్లోరెన్స్



చౌటపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో..

సంచార జాతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

సయ్యద్‌పై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

గుడివాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : సంచార జాతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్‌పై ఏలూరు జిల్లా పెదపాడు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఏలూరులో జరుగుతున్న సంచార జాతుల సంఘం సమావేశానికి బుధవారం రాత్రి గుడివాడ నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. చికిత్స పొంది గుడివాడలోని ఇంట్లో ఉన్న సయ్యద్‌ను వైసీపీ జిల్లా నాయకులు మండలి హనుమంత రావు, కొంకితల ఆంజనేయప్రసాద్, షేక్ బాజీ, కరీముల్లా, షమ్మ తది తరులు పరామర్శించారు. మండలి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం దాడులు చేస్తోందని, టీడీపీ గూండాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సయ్యద్‌పై జరిగిన దాడిని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామని మండలి స్పష్టం చేశారు.



బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

యువకుడిపై దాడి - కేసు నమోదు

గుడివాడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ధనియాలపేటకు చెందిన దుర్గ ప్రసాద్, పెద్దిరాజుల వాళ్ల అబ్బాయికి మధ్య జరిగిన వివాదంలో దుర్గప్రసాద్‌ను పెద్దిరాజుల వాళ్ల అబ్బాయి కొట్టడంతో చేతికి, కాలుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దుర్గాప్రసాద్‌ను ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడిన దుర్గాప్రసాద్‌ను కొట్టిన వ్యక్తి పేరు పోలీసులకు తెలియకపోవడం విశేషం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎఎస్ఐ నరసింహారావు తెలిపారు.



వన్నేరు డ్రెయిన్‌లో

గుర్రపు డెక్క తొలగించాలి

ఆంధ్రజ్యోతి - పెదపారుపూడి

మోపర్రు గ్రామంలో వన్నేరు డ్రెయిన్‌లో గుర్రపు డెక్క పేరుకుపోయి కిందకి నీరు వెళ్లక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. గత వర్షాకాలంలో మురుగు పోక వరద నీరు చేరటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు.

డ్రైనేజీ డీఈ గణపతిని వివరణ కోరగా, వన్నేరు డ్రెయిన్‌పూడికతీత కోసం అంచనాలు రూపొందించి పంపించామని, త్వరలో గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియను చేపడతామని చెప్పారు.

> వన్నేరు డ్రెయిన్‌లో గుర్రపు డెక్క తొలగించాలి. గత వర్షాకాలంలో మురుగునీరు పోక పోవటంతో సార్వా పంట నష్టపోయాం. ఈ సంవత్సరం అయినా డ్రైనేజీ పూడికతీయించి మురుగునీరు కిందకు వెళ్లేలా చర్యలు చేపట్టాలి.
> బోయిన సాంబశివయ్య, మోపర్రు, రైతు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి 3600 గ్రాముల వెండి సమర్పణ



మోపిదేవి, మే 30 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి తెనాలికి చెందిన కడియాల సుధీర్ కుటుంబ సభ్యులు మూడు కేజీల 600 గ్రాముల వెండిని శుక్రవారం సమర్పించారు. ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని రూ.3.50 లక్షల విలువ గల వెండిని ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అందజేశారు. ఆలయ అధికారులు వారికి స్వామివారి ప్రసాదం అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పార్కింగ్ వివాదంలో ఘర్షణ

మచిలీపట్నం టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పార్కింగ్ విషయమై సెక్యూరిటీ గార్డు, మరోవ్యక్తి ఘర్షణపడ్డారు. ఇద్దరినీ వైద్యులు మందలించి పంపారు.



మునిసిపల్ పార్కులో యోగాసనాలు వేస్తున్న మునిసిపల్ ఉద్యోగులు



యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న జిల్లా క్రీడాధికారి ఝాన్సీలక్ష్మి



చినకళ్లేపల్లి, చల్లపల్లిలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మచిలీపట్నం టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : యోగా సాధన వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా క్రీడాధికారి కె.ఝాన్సీలక్ష్మి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నగర పాలక సంస్థ 45వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి పి.వి.ఫణికుమార్ ఆధ్వర్యంలో ఈడేపల్లి గానుగ కొట్టు నుంచి మునిసిపల్ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఝాన్సీలక్ష్మి అతిథిగా పాల్గొని ప్రసంగించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కృష్ణవేణి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కొత్తగుండు రమేష్, యోగా మాస్టర్ మద్దాల చింతయ్య, 45వ డివిజన్ సచివాలయ అడ్మిన్ అల్లాభక్షు, ఎం.మానస, గంగాభవానీ, రామాంజనేయులు, రామశేఖర్, పుట్టిరత్నం, సిద్దినేని అంజనాదేవి, కొనకళ్ల భానుప్రసాద్, మురాల నాగేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ ప్రధాన పార్కులో..

మునిసిపల్ ప్రధాన పార్కులో శుక్రవారం నిర్వహించిన యోగా శిక్షణా తరగతుల్లో సచివాలయ ఉద్యోగులు, నగర పాలక సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ బీచ్‌లో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని, ఇందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. మద్దాల చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి మండల కార్యాలయంలో..

చల్లపల్లి : జీవితంలో యోగా ప్రధానమైనదనీ, ప్రతి ఒక్కరూ యోగాను ఆచరించటం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పొందగలుగుతారని చల్లపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో వి.రవిశంకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పాగోలు, పురిటిగడ్డ, యార్లగడ్డ, వక్కలగడ్డ, నడకుదురు, ఆముదార్లంక సచివాల యాల ఉద్యోగులకు యోగా శిక్షణ నిర్వహించారు. శిక్షకులు శ్రీరామకృష్ణప్రసాద్, ఎన్.వెంకటేశ్వరరావు, ఎంఎస్.ప్రసన్న, నాగరాజు యోగా ఆవశ్యకత తెలియచేసి యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో రవిశంకర్ పర్యవేక్షించారు. ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు అధికారులు, ఉద్యోగులు కృషిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చినకళ్లేపల్లిలో..

ఘంటసాల : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ట్రైనర్లు శేషగిరిరావు, జి.మారుతి తెలిపారు. చినకళ్లేపల్లి గ్రామంలో సచివాలయాల ఉద్యోగులకు శుక్రవారం యోగా శిక్షణ ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులచే వివిధ ఆసనాలు వేయించారు. ఆరోగ్యవంతమైన జీవన విధానానికి యోగా ప్రతీరోజూ చేయాలని సూచించారు. గ్రామసర్పంచ్ గుత్తికొండ రామారావు, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

గాజుల లక్ష్మి కుటుంబానికి ప్రమాద బీమా చెల్లించాలి

అవనిగడ్డ రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనికి వెళ్లి చనిపోయిన గాజుల లక్ష్మి కుటుంబానికి ప్రమాద బీమా చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. ప్రమాద బీమా కింద ప్రభుత్వం సహాయం ప్రకటించి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గాజుల లక్ష్మి మృతికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ తరపున సంతాపం తెలియజేస్తూ కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మెడికల్ కిట్లు, షామియానా, మంచినీరు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

నాగాయలంక, మే 30 (ఆంధ్రజ్యోతి): అన్ని రైతు సేవా కేంద్రాలలో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో సంజీవ్ కుమార్ తెలిపారు. వ్యవసాయ శాఖ రైతులకు 30 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు సిద్ధంగా ఉంచిందన్నారు. రైతులు ఆధార్ కార్డు, భూమి వివరాలతో సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. జీలుగ కేజీ అసలు ధర రూ.123 కాగా, సబ్సిడీపై రైతులకు రూ.61.50లకు అందిస్తుండగా, పిల్లి పెసర కేజీ రూ.180 కాగా, సబ్సిడీపై రూ.90లకే అందిస్తున్నామన్నారు.

మత్స్య డిప్లొమో కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగాయలంక, మే 30 (ఆంధ్రజ్యోతి) : భావదేవరపల్లి మత్స్య పాలిటెక్నిక్ కళాశాల లలో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు కోరారు. మే 30వ తేదీ నుంచి జూన్ 20 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఓపిఎఫ్‌యు.ఏపీ.జివోవి.ఇన్ వెబ్‌సైట్ ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

విగ్రహాల నిర్మాణానికి స్థలం కేటాయించాలి

అవనిగడ్డ, మే 30 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ వంతెన సెంటర్, పెట్రోల్ బంక్ ముందు ఉన్న ప్రభుత్వ ఖాళీ ప్రదేశంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాలు పెట్టుకోవటానికి అనుమతి ఇవ్వాలని టీడీపీ నాయకులు అధికారులను కోరారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, గుడివాడ పద్మాయ్, యలవర్తి ఆది, మాదివాడ రాము, వెంకటేశ్వరరావు, ప్రభాకర్ పాల్గొన్నారు



రామకృష్ణకు జూలూరి అభినందన

మచిలీపట్నం టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : అంచెలంచెలుగా ఎదిగిన బండి రామకృష్ణ ఆదర్శ నేత అని తెలంగాణా రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, ప్రముఖ కవి జూలూరి గౌరీశంకర్ అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన బండి రామకృష్ణను శుక్రవారం గౌరీశంకర్ కలిసి అభినందించి సత్కరించారు. సామాజిక వికాసంతో పాటు ప్రజాసేవకు బండి రామకృష్ణ అంకితమవడం ముదావహమన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, రిటైర్డు హెడ్‌మాస్టర్ ఎండి ఖలీల్ పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ సమయంలోని సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న రచయిత సారంగపాణి

మచిలీపట్నం టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఎమర్జెన్సీ సమయంలో ఎన్నో కవితలు, గేయాలు, కథలు, లేఖలు వెలుగులోకి రాలేదని, వాటిని అధ్యయనం చేయడంతో పాటు పరిశోధనలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ రచయిత బొమ్మరాజు సారంగపాణి అన్నారు. ఆంధ్రసారస్వత సమితి ఆధ్వర్యంలో శుక్రవారం బాలాజీ విద్యాలయంలో జరిగిన సాహిత్య సభలో సారంగపాణి ఎమర్జెన్సీ కాలంలో వెలువడిన అజ్ఞాత సాహిత్యంపై ప్రసంగించారు. ఆంధ్ర సారస్వత సమితి అధ్యక్షులు కొమరగిరి చంద్రశేఖర్, కార్యదర్శి అప్పినేడి పోతురాజు, భవిష్య, వడ్డి జితేంద్ర, యర్రపోతు సురేష్, మన్నెం సత్యనారాయణ మూర్తి, మేడిశెట్టి యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న బౌద్ధ గురువు బంతేజి

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం

ఘంటసాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయమని బౌద్ధ గురువు బంతేజీ పేర్కొన్నారు. ఘంటసాలపాలెం చిన్నదళితవాడలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి శుక్రవారం రూ.5 వేలు విరాళాన్ని కమిటీ సభ్యులకు బంతేజీ అందించారు. చిన్నదళితవాడలో కూడా బౌద్ధమతం విరా జిల్లినట్లు తెలిపారు. గ్రామ ప్రముఖులు దోనె వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పల్లికొండ కొండలరావు, ఉప్పులేటి సుదర్శన్, ఒంపుగాని బాబురావు, కంచర్ల కోటేశ్వరరావు, కంచర్ల వెంకటేశ్వరరావు, కూరపాటి శరత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ప్రతిష్ఠా మహోత్సవాలు



కోడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : జరుగువాని పాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆంజనేయస్వామి విగ్రహాన్ని శుక్రవారం పురవీధుల్లో మేళతాళాలతో వైభవంగా ఊరేగించారు. మహిళల మురళీ కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. జూన్ 2వ తేదీ ఉదయం 8.09 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 11.30 గంటలకు అన్నసమారాధన చేస్తున్నామన్నారు.



మునేశ్వరరావుకు టీడీపీ నేతల సత్కారం

అవనిగడ్డ, మే 30 (ఆంధ్రజ్యోతి) : కోడూరు నుంచి కడప మహానాడుకు సైకిల్‌పై వెళ్లిన మునేశ్వరరావు స్ఫూర్తి ప్రదాత అని టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు అన్నారు. మునేశ్వరరావును మండల టీడీపీ కార్యాలయంలో చిట్టిబాబు ఘనంగా సత్కరించారు. బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, చందన నరసింహారావు, గుగ్గిలం శ్యాం కుమార్, పులిగోరు రాజేందర్, గుడివాక శివరాం, విశ్వనాథుని మురళీ మోహన్, చెన్ను రాంబాబు, యలవర్తి చిన్నా, మాణిక్యాలరావు, మొగల్ మురాద్ బేగ్, బచ్చు శ్రీనివాసరావు, సోమిరెడ్డి, లింగం బాబురావు, అన్నపరెడ్డి రాందాసు, మలిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల ఏఎంసీ ప్రమాణ స్వీకారం విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

అవనిగడ్డ, మే 30 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం, ఏఎంసీ ప్రమాణ స్వీకార కార్యక్రమ సన్నాహాలపై శుక్రవారం సమీక్ష జరిగింది. ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ జూన్ 2న ఉదయం 10 గంటలకు కొడాలి మార్కెట్ యార్డు కార్యాలయంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు.

రైతు సంఘం ధర్నా

బంటుమిల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురం సెంటర్‌లో శుక్రవారం జరిగిన ధర్నా నిర్వహించారు. ధాన్యం క్వింటాకు రూ.3200 ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గౌరిశెట్టి నాగేశ్వరరావు, శివశ్రీనివాసరావు, ఏసుబాబు, జేజిబాబు, సూరిబాబు, శ్యామ్‌బాబు, బాపూజీ, సుంకర వెంకన్న, కన్నారావు, నాగరాజు, చంద్రశేఖర్, సుంకర పాములు, వీరబాబు, వెంకటనారాయణ, పొదిలి వెంకన్న, మురళీ, అజయ్‌ఘోష్, వంగలరాజు పాల్గొన్నారు.